www.epaper.samayamdaily.net
APTEL/2006/18267

# సమయం

సామాన్యుల గళం
తెలుగు దినపత్రిక

సంపుటి - 18 | సంచిక 96 | ఎడిటర్ : వి. విక్రం కుమార్ | శనివారం 07, డిసెంబర్ 2024 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు 8 | వెల రూ. 5

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

తెలుగు రాష్ట్రాల్లో ప్రభావం చూపే అవకాశం
పలు ప్రాంతాల్లో జోరు వానలకు అవకాశం

2

## చెత్త సమస్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ అనేక చర్యలు

సిటీలో జీవీపీ పాయింట్స్ ఏర్పాటుకు సన్నద్ధం
ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయం

2

## డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదు

డాలర్ స్థానంలో వేరే కరెన్సీని ఉపయోగించే దేశాలపై పన్నులు
డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన

3



## రాష్ట్రంలో చాలా అద్భుతంగా కాంగ్రెస్ పాలన

ఓర్వలేక బీఆర్ఎస్ ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతుంది
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3




# అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ ఏర్పాటు

- పోలీసులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా కాంగ్రెస్ పాలన
- సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రభుత్వ సహకారం
- పైరవీలు లేకుండా పోలీస్ శాఖలో బదిలీల, పదోన్నతులు
- ప్రజా పాలన విజయోత్సవాలలో సిఎం రేవంత్ రెడ్డి
- హోం శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు
- పోలీస్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు
- రాష్ట్రంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం
- 2 వేల మంది సిబ్బందితో ఎస్‌డీఆర్ఎఫ్
- సిబ్బందికి శిక్షణ ఇప్పించిన ప్రభుత్వం
- ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తి స్వేచ్ఛ

2





51 గ్రామాల విలీనానికి

## లైన్ క్లియర్

ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల విలీనానికి గ్రీన్ సిగ్నల్
పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ మాజీ సర్పంచుల పిటిషన్
పిటిషన్‌ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

2

తెలంగాణ ప్రభుత్వం

## గుడ్ న్యూస్..

నేటి నుంచే
సిఎం కప్ - 2024 ప్రారంభం

2




వాహనాల క్రమబద్ధీకరణకు

## స్క్రాప్ పాలసీ

15 సంవత్సరాలు దాటిన వాహనాలకు సరికొత్త పాలసీ
వాయు కాలుష్యం వెదజల్లే వాహనాలపై దృష్టి
డీజిల్ వాహనాలపై ఆంక్షలు విధించేందుకు రంగం సిద్ధం
డీజిల్ బస్సులను ఔటర్ రింగ్ రోడ్డు అవతల నడిపేలా చర్యలు
ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే సిటీలో పర్మిషన్

వివరాలు 2లో

# వివక్షకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన మహనీయుడు

**అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు అసాధారణం**
**బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ : మాజీ సీఎం కేసీఆర్**

**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమయం న్యూస్):**

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దేశానికి వారందించిన సేవలను, అనితర సాధ్యమైన కృషిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్య అనంతరకాలంలో ప్రపంచానికే ఆదర్శవంతమైన స్వయంపాలన కోసం రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. ఆర్థిక సామాజిక రాజకీయ సాంస్కృతిక తదితర రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన వాటా సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని పొందుపరచడం లో బాబాసాహెబ్ కనబరిచిన దార్శనికత మహోన్నతమైన దని కేసీఆర్ కొనియాడారు. దేశంలో

రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా అంబేద్కర్ - మిగతా 2లో..



## హరీశ్‌రావుతోపాటు కవిత నిర్బంధం

**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమయం న్యూస్):**

ఎమ్మెల్యేలు, నేతల అక్రమల అరెస్టులకు నిరసనగా ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేస్తున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు కవిత, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, పద్మారావు గౌడ్, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను హౌస్ అరెస్టు చేశారు. కోకాపేటలోని హరీశ్‌రావు ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఆయన బయటకి వెళ్లనీయకుండా గృహ నిర్బంధం చేశారు. దీంతో పోలీసులతో హరీశ్‌రావు వాగ్వాదానికి దిగారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళులు అర్పించేందుకు వెళ్లకుండా ఈ నిర్బంధాలు ఎందుకని ప్రశ్నించారు. ఇక శుక్రవారం ఉదయం నుంచే ఎమ్మెల్సీ కవిత ఇంటికి పోలీసులు చేరుకున్నారు. ఆమెను ఇంట్లో నుంచి బయటకు రాకుండా చూస్తున్నారు. ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును హౌస్ అరెస్టు చేసిన పోలీసులు.. వారి నివాసాల వద్ద భారీగా మోహరించారు.

## విద్యార్థుల్ని మేము ఎవరెస్ట్ ఎక్కిస్తుంటే, ప్రభుత్వం పాడె ఎక్కిస్తోంది

దళితుల అభివృద్ధికి సైతం ఈ ప్రభుత్వం వ్యతిరేకం
దళిత బంధు పెంచి ఇస్తామంటూ హామీ ఇచ్చి మోసం
అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజులపాటు నిర్వహించాలి
భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


7



## ఇన్ని నిర్బంధాలు ఎందుకు?

**రాష్ట్రంలో నియంతృత్వ పాలన : హరీశ్‌రావు**

**హైదరాబాద్,డిసెంబర్ 6 (సమయం న్యూస్):**



రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వెళ్ళనివ్వకుండా ఈ నిర్బంధాలు ఎందుకని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఇది నీ నిరంకుశ, నియంతృత్వ పాలనకు నిలువుటద్దమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకవైపు ప్రజా పాలన విజయోత్సవాలు అని ప్రచారం చేసుకుంటూ, మరోవైపు రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీని ప్రకటించావని ధ్వజమెత్తారు. మీ అప్రజాస్వామిక విధానాలు, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వైఖరిని చూసి హైదరాబాద్ నడిగడ్డపై ఉన్న అంబేద్కర్ సైతం నివ్వెరపోతున్నాడని చెప్పారు. అదుపులోకి తీసుకున్న తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

www.epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
సామాన్యుల గళం తెలుగు దినపత్రిక

# వాహనాల క్రమబద్ధీకరణకు స్క్రాప్ పాలసీ

**15 సంవత్సరాలు దాటిన వాహనాలకు సరికొత్త పాలసీ**
**వాయు కాలుష్యం వెదజల్లే వాహనాలపై దృష్టి**
**డీజిల్ వాహనాలపై ఆంక్షలు విధించేందుకు రంగం సిద్ధం**
**డీజిల్ బస్సులను ఔటర్ రింగ్ రోడ్డు అవతల నడిపేలా చర్యలు**
**ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే సిటీలో పర్మిషన్**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

ఇప్పటికే మహాలక్ష్మీ ఉచిత బస్సు పథకంతో ఇబ్బంది పడుతున్న ఆటోలకు ఇది మరో షాకింగ్ న్యూస్..! ఢిల్లీలో పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వ అలర్ట్ అయింది. వాయు కాలుష్యం ఎక్కువగా వెదజల్లే వాహనాల క్రమబద్ధీకరణకు కొత్త పాలసీని అమలు చేయాలని నిర్ణయించింది తెలంగాణ ప్రభుత్వం. అందులో భాగంగా 15 సంవత్సరాలు దాటిన వాహనాలకు సరికొత్త స్క్రాప్ పాలసీని తీసుకొచ్చింది. అంతేకాకుండా డీజిల్ వాహనాలను నగర శివారు ప్రాంతాలకే పరిమితం చేయాలని భావిస్తోంది. కాలుష్యం ఎక్కువగా పెరిగిపోతుడడంతో హైదరాబాద్ మహానగరంలో డీజిల్ వాహనాలపై ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది రాష్ట్ర ప్రభుత్వం. అందులో భాగంగా హైదరాబాద్‌లో నడుస్తున్న ఆర్టీసీ బస్సుల్లో 90% బస్సులు డీజిల్ వాహనాలే. అందుకని డీజిల్ బస్సులను ఔటర్ రింగ్ రోడ్డు అవతలకు తరలించాలని నిర్ణయించింది. ఇక, మూడు వేల కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి హైదరాబాద్‌లో తిప్పనున్నారు. ఇక, బస్సుల తర్వాత అత్యధికంగా రోడ్ల మీద నడిచే వాహనాల్లో ఆటోలు కూడా ప్రధానం. అందుకనే డీజిల్‌తో నడిచే ఆటోలను కూడా ఔటర్ రింగ్ రోడ్డు బయటకు తరలించాలని రింగ్ రోడ్డు లోపల తిరిగేందకు ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే పర్మిషన్ ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. ఈ విషయాన్ని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి గురువారం జరిగిన రవాణా శాఖ ఉత్సవాల్లో ప్రకటించారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి అందించాలంటే కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకొందామని సీఎం పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా హైదరాబాద్ నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడాలంటే ఎట్టి పరిస్థితుల్లో డీజిల్ వాహనాలు తిరగకూడదని చెప్పారు. డీజిల్ బస్సులను ఔటర్ రింగ్ రోడ్డు వరకే పరిమితం చేయాలని సూచించారు. అలాగే డీజిల్ ఆటోలను సైతం నగర శివారులకు తరలించాలని భావిస్తున్నట్లు తెలిపారు. అయితే, ఎలక్ట్రిక్ బస్సులు వాడాలనుకోవడం సరే, కానీ ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు స్కీం తో ఆదాయ కోల్పోయిన ఆటోలకు ఇప్పుడు డీజిల్ ఆటోలకు సిటీలో తిరగనివ్వమని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అది కచ్చితంగా షాకింగ్ న్యూస్ అంటున్నారు. అయితే దీనిపై ఇప్పుడు ఆటో యూనియన్ ఎలా స్పందిస్తాయో చూడాలి. హైదరాబాద్ మహానగరంలో దాదాపుగా ఆటోలన్ని ఎల్పీజీ తో నడుస్తూ ఉన్నాయి. అయితే హైదరాబాద్‌లో నడుస్తున్న డీజిల్ ఆటోల సంఖ్య ఎంత అనేది తేలితే ఈ నిర్ణయం వల్ల ఆటో యూనియన్ నుంచి వ్యతిరేకత ఎంత మేర వస్తుందనేది అంచనా వేయొచ్చు..! కాలుష్యాన్ని తగ్గించాలనుకోవడం మంచి ఆలోచన. డీజిల్ వాహనాలను ఔటర్ రింగ్ రోడ్డు లోపల తిరగవద్దనుకునే ఆలోచన మంచిదే..! కానీ దానివల్ల ఆటో వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు మాత్రం నగరంలో డీజిల్ ఆటోలు తిరగకూడదని నిర్ణయం వల్ల ఇబ్బంది పడటం తప్పని పరిస్థితిలో కనిపిస్తుంది..

## వివక్షకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన మహనీయుడు

మొదటి పేజీ తరువాయి

పొందుపరిచిన ఆర్టికల్ 3, ఈ దిశగా వారి దార్శనికత, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం చూపిందని గుర్తు చేశారు. వారి విశేష కృషిని, వారు అందించిన స్ఫూర్తిని చాటేందుకు ప్రపంచంలోనే అత్యంత మహోన్నతమైన రీతిలో వారి స్ఫురద్రూపాన్ని తెలంగాణాలో అత్యంత ఎత్తయిన విగ్రహం గా నిలుపుకున్నామన్నారు. దేశ పాలనకు తన రాజ్యాంగం ద్వారా బాటలు వేసిన బీఆర్ అంబేద్కర్ ఘనమైన కీర్తిని చాటేందుకు దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేనివిధంగా తెలంగాణ పాలనా భవనానికి 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్' అని పేరు పెట్టుకున్నామని తెలిపారు. వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన అంబేద్కర్ అజరామర కీర్తిని ప్రపంచానికి చాటేందుకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. అనేక విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు. అంటరాని వర్గాలుగా తర తరాలుగా వివక్షకు గురవుతున్న దళిత సమాజాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి వారి సామాజిక గౌరవం ఇనుమడింప చేసే దిశగా, అంబేద్కర్ స్ఫూర్తితోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం అమలు చేసిందన్నారు. దళిత జీవితాల్లో వెలుగులు నింపే దిశగా దళిత బంధు సత్ఫలితాలు సాధించిందని తెలిపారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని రంగాల్లో వివక్ష లేని సమ సమాజ నిర్మాణానికి అవసరమైన కృషి చేయడం ద్వారానే, అంబేద్కర్ మహనీయునికి మనం ఘన నివాళి అర్పించగలమని కేసీఆర్ పేర్కొన్నారు.

## చెత్త సమస్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ అనేక చర్యలు

**సిటీలో జీవీపీ పాయింట్స్ ఏర్పాటుకు సన్నద్ధం**
**ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయం**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్) :**

హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో చెత్త పెద్ద సమస్యే. చెత్తను ఎక్కడపడితే అక్కడే వేస్తున్నారు. సమస్య పరిష్కారానికి జీహెచ్ఎంసీ అనేక చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేదు. దీంతో దుర్వాసన, దోమలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో జీహెచ్ఎంసీ కొత్త ప్రణాళికను రూపొందించేందుకు సన్నద్ధమవుతోంది. ఐతే.. ఇందులో ఒక షాక్ కూడా ఉంది. ఈ చెత్తను సేకరించడానికి ప్రభుత్వం సిటీలో అక్కడక్కడా గార్బేజ్ వర్నరబుల్ పాయింట్ లను గుర్తించింది. ఇవన్నీ తీవ్రమైన చెత్తను పారపోస్తున్న ప్రాంతాలుగా అధికారులు గుర్తించారు. ఇక్కడ ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ముగ్గులు వేయడం, ప్రత్యేకంగా ఓ వ్యక్తిని కాపాలాగా పెట్టడం వంటి కొన్ని చర్యలను చేపట్టింది. అయినా ప్రజలు తీరు మార్చుకోవట్లేదనీ, ఏదో ఒక రకంగా చెత్త వేస్తూనే ఉన్నారని అధికారులు అంటున్నారు. గ్రేటర్‌లో చెత్త సమస్యను పరిష్కరించడానికి జీహెచ్ఎంసీ కొత్త ప్లాన్ రూపొందించింది. చెత్త పేరుకుపోకుండా, చెత్త కనిపించకుండా ఉండడానికి ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జీహెచ్ఎంసీ పరిధిలోని చాలా ప్రాంతాల్లో గార్బేజ్ కలెక్షన్ సెంటర్ పేరుతో ఆల్రెడీ ఏర్పాటు చేశారు. చెత్త వేసినప్పుడు ఆ చెత్త.. డస్ట్ బిన్‌లో పడకుండా.. కింద పడితే.. అది ప్రజలకు కనిపించకుండా ఉండేలా ఈ క్యాబిన్‌లను రూపొందించారు. తద్వారా ఆ చెత్త ఉన్న ప్రదేశం చూడటానికి అందంగానే కనిపిస్తుంది. ప్రధానంగా మురికివాడల్లో ఈ క్యాబిన్ లను మరింతగా ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. చెత్త ఎక్కువగా పేరుకుపోతున్న ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో గార్బేజ్ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. మొదటి దశలో తీవ్రమైన చెత్త ఉత్పత్తి ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం ప్రత్యేక క్యాబిన్‌లో రెండు డస్ట్ బిన్‌లు ఉంటాయి. చెత్త కనిపించకుండా ఉండేలా క్యాబిన్‌ను రూపొందించారు. ప్రధానంగా చెత్త ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మురికివాడల్లో గార్బేజ్ కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. చాలా ప్రాంతాల్లో చెత్తను ఎక్కడిపడితే అక్కడ వేస్తున్నట్లు గుర్తించారు. దీనిని అరికట్టడానికి భారీగా పెనాల్టీ వేయాలని నిర్ణయించారు. దీనికోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్ తయారు చేస్తున్నామనీ, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. తద్వారా త్వరలో భారీ ఫైన్లు వేసేందుకు అధికారులు ప్లాన్ రెడీ చేస్తున్నట్లు తెలిసింది. అందువల్ల ప్రజలు అప్రమత్తమై.. చెత్తను ఎక్కడ వెయ్యాలో అక్కడే వెయ్యడం ద్వారా ఎలాంటి సమస్యా ఉండదు.

### ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు రేవంత్ రెడ్డికి ఆహ్వానం

హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు ఆహ్వానించారు. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు అలహాబాద్‌లో మహాకుంభమేళా జరగనుంది. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే కుంభమేళా సందర్భంగా పవిత్ర నదుల్లో స్నానం చేయడం మంచిదని భక్తులు భావిస్తారు.

## అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ ఏర్పాటు

**తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పూర్తి స్వేచ్ఛ**
**పోలీసులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా కాంగ్రెస్ పాలన**
**సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రభుత్వ సహకారం**
**పైరవీలు లేకుండా పోలీస్ శాఖలో బదిలీల, పదోన్నతులు**
**ప్రజా పాలన విజయోత్సవాలలో సిఎం రేవంత్ రెడ్డి**
**హెూం శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు**
**పోలీస్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి వరాల జల్లు**
**రాష్ట్రంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం**
**2 వేల మంది సిబ్బందితో ఎస్‌డీఆర్ఎఫ్**
**సిబ్బందికి శిక్షణ ఇప్పించిన ప్రభుత్వం**
**ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా తెలంగాణ పోలీసుల ధైర్య సాహసాలు కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు. ఇందుకు వేదికగా మారింది హైదరాబాద్ లోని హెచ్ఎండీఏ గ్రౌండ్. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో హెూం శాఖ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా పలు స్టాల్స్ లను ఏర్పాటు చేయగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, అధికారులు వాటిని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. మహనీయులు అంబేద్కర్ స్ఫూర్తితో తెలంగాణ ఏర్పడిందని, తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో స్వేచ్ఛను ఇచ్చిందన్నారు. ఇప్పటికే తాము ఆరు గ్యారెంటీలను ప్రవేశపెట్టామని, అదే రీతిలో ఏడో గ్యారంటీగా స్వేచ్ఛను అందించమని సీఎం అన్నారు. పోలీసులపై ఎటువంటి ఒత్తిడి లేకుండా కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తి చేసుకుందని తెలిపారు. సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రభుత్వం అన్ని విధాలా పోలీసులకు సహకరిస్తుందన్నారు. అలాగే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగాన్ని తెలంగాణ పోలీసులు పూర్తి స్థాయిలో అడ్డుకుంటున్నారని, మరింత స్పీడ్ పెంచాల్సిన ఆవశ్యకత పోలీసులపై ఉందన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా పోలీస్ శాఖలో బదిలీల, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసినట్లు సీఎం పునరుద్ఘాటించారు. హైదరాబాద్ అంటేనే డ్రగ్స్ విక్రయాలు నిర్వహించేందుకు భయపడే రీతిలో పోలీసులు విధులు నిర్వర్తించాలని సీఎం సూచించారు. అలాగే విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కూడా పోలీస్ శాఖ కూడా తన వంతు భాధ్యత వహించాలని సీఎం సూచించారు. ట్రాఫిక్ విధుల్లోకి ట్రాన్స్ జెండర్స్ ను తీసుకొని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, సమాజ నిర్లక్ష్యానికి గురైన వారి విధులను పోలీస్ శాఖ సద్వినియోగం చేసుకుంటుందని తెలిపారు. ఉగ్రవాదుల ముప్పు సమయంలో గ్రేహౌండ్స్ బలగాలు ప్రాణాలు అర్పిస్తే వారి కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తూ తోడ్పడుతుందన్నారు. తెలంగాణ హెూం గార్డ్స్ కి జీతాలు పెంచినట్లు సీఎం శుభవార్త చెప్పారు. ఎవరైనా హెూం గార్డ్స్ విధుల్లో ప్రాణాలు అర్పిస్తే, వారి కుటుంబాలకు రూ. 5 లక్షలు అందిస్తామన్నారు. అంతేకాకుండా వారికి హెల్త్ కార్డ్ లు కూడా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, కొత్త సంవత్సరంలో నూతన ఆదేశాలు అమలవుతాయని సీఎం అన్నారు. పోలీస్ కుటుంబాల పిల్లల చదువుల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని, అందుకు 50 ఎకరాలలో స్కూల్ నిర్మించడం జరుగుతుందని, హెూం గార్డ్ నుండి డీజీపీ స్థాయి అధికారి పిల్లలకు ఉచిత విద్యను కార్పొరేట్ స్థాయిలో అందిస్తామని సీఎం వరాల జల్లు కురిపించారు. రాష్ట్రంలో సుమారు 94 వేల మంది పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్నారని, వారి కృషి ఉత్తమ విధులతోనే రాష్ట్రం శాంతిభద్రతల పరిరక్షణలో ఎప్పుడూ ముందంజలో ఉందని సీఎం అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు రాష్ట్ర విపత్తు నిర్వహణ దళంను (ఎస్‌డీఆర్ఎఫ్) ప్రారంభించారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా హెూంశాఖ వేడుకలను నిర్వహించింది. ఈ క్రమంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో దాదాపు రెండు వేల మంది సిబ్బందితో ఎస్‌డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్ర విపత్తు దళానికి చెందిన బోట్స్‌ను కూడా సీఎం ప్రారంభించారు. భారీ అగ్నిప్రమాదాలు, భూకంపం, వరదలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ఈ దళం అత్యవసర సహాయక చర్యలు చేపట్టనుంది. అగ్నిమాపక కేంద్రాలు ఇక నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ స్టేషన్లుగా రూపాంతరం చెందనున్నాయి. జులై, ఆగస్ట్ నెలల్లో భారీ వర్షాలు కురవడంతో హైదరాబాద్, ఖమ్మం సహా పలు ప్రాంతాలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... ఎన్‌డీఆర్ఎఫ్ తరహాలో సుశిక్షితులైన దళం అవసరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఎస్‌డీఆర్ఎఫ్ ను ఏర్పాటు చేయడంతో పాటు దీనిని ఆధునికీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35.03 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆధునాతన పరికరాలు, కొత్త అగ్నిమాపక వాహనాలను కొనుగోలు చేసి సిబ్బందికి ఎస్‌డీఆర్ఎఫ్ ప్రాథమిక కోర్సులో శిక్షణ ఇప్పించారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

**తెలుగు రాష్ట్రాల్లో ప్రభావం చూపే అవకాశం**
**పలు ప్రాంతాల్లో జోరు వానలకు అవకాశం**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

దక్షిణాదిన దడ పుట్టించిన ఫెంగల్ తుపాన్ తీరం దాటడంతో అంతా హమ్మయ్య అనుకున్నారు. ఫెంగల్ తుఫాను బలహీనపడి అల్పపడీనంగా మారి అరేబియా సముద్రంలోకి ప్రవేశించింది. దీంతో ఇప్పట్లో వానలు మళ్లీ రావులే అని జనాలు సంబరపడ్డారు. కానీ ఇంతలో వాతావరణ శాఖ మరో సంచలన వార్త అందించింది. తాజాగా బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్నట్టు వాతావారణ శాఖ వెల్లడించింది. ఈ మేరక శుక్రవారం వాతావరణ శాఖ ప్రకటన జారీ చేసింది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాలో వాతావరణం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురుస్తుందని తెలిపింది. డిసెంబర్ 6,7 తేదీల్లో ఏర్పడే ఆవర్తనం దక్షిణ దిశగా పయనించే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. అది డిసెంబర్ 7 నాటికి అల్పపీడనంగా మారనున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. అది వాయువ్య దిశగా పయనించి డిసెంబర్ 12 నాటికి తమిళనాడు-శ్రీలంక తీర రేఖకు చేరుకుంటుందని అంచనా. దీని ప్రభావంతో తమిళనాడులోని దక్షిణ కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైలోని కొన్ని ప్రాంతాలు, దాని శివారు ప్రాంతాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ శాఖ తెలిపింది. డిసెంబర్ 12, 13 తేదీల్లో తమిళనాడులోని దక్షిణ కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని %×వీణ% అంచనా వేసింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని హెచ్చరించింది. ఈ రోజుల్లో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు.కాగా ఇప్పటికే ఫెంగల్ తుఫాను ప్రభావం నుంచి నెల్లూరు, తిరుపతి, రాయలసీమ జిల్లాలు, అటు తమిళనాడు కోలుకోక ముందే తాజాగా బంగాళాఖాతంలో మరో అల్పపీడనానికి అనువైన పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఆందోళ చెందుతున్నారు. ఆరుగాలం పండించిన పంట ఎక్కడ నీటపాలవుతుందోనన్న భయంతో అందిన కాడికి అమ్మేసుకుంటున్నారు. ఇక ఏపీలో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడనున్నాయి. మరికొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.

## 51 గ్రామాల విలీనానికి లైన్ క్లియర్

**ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల విలీనానికి గ్రీన్ సిగ్నల్**
**పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ మాజీ సర్పంచుల పిటిషన్**
**పిటిషన్‌ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల విలీనానికి లైన్ క్లియర్ అయింది. మున్సిపాలిటీల్లో 51 గ్రామాల విలీనానికి ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌కు హైకోర్టులో అడ్డంకులు తొలగిపోయాయి. పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ.. మాజీ సర్పంచులు వేసిన పిటిషన్‌ను కొట్టేసింది హైకోర్ట్. పెద్ద అంబర్‌పేట, శంషాబాద్, నార్సింగి, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట మున్సిపాలిటీల్లో 51 గ్రామాలు విలీనం కానున్నాయి. మేడ్చల్ జిల్లాలో మొత్తం 28 గ్రామాలు ఏడు మున్సిపాలిటీల్లో విలీనం చేస్తున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 12 గ్రామాలు, సంగారెడ్డి జిల్లాలో రెండు మున్సిపాలిటీల్లో 11గ్రామాలు విలీనం కానున్నాయి. ఈ గ్రామాలన్నీ కూడా ఔటర్ రింగు రోడ్డుకు అనుకున్న గ్రామాలే. శివారు గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం తర్వాత వీటన్నింటినీ గ్రేటర్‌లో కలిపే అవకాశం ఉంది. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో బాచారం, గౌరెల్లి, తారామతిపేట పంచాయతీలు విలీనం కానున్నాయి. శంషాబాద్ మున్సిపాలిటీలో.. బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్ గూడ, ఘంసీమిగూడ విలీనం అవుతాయి. నార్సింగి మున్సిపాలిటీలో మీర్జాగూడ గ్రామపంచాయతీ విలీనం కానుంది. తుక్కుగూడ మున్సిపాలిటీలో హర్షగూడ గ్రామపంచాయతీ.. మేడ్చల్ మున్సిపాలిటీలో పూడూరు, రాయిలాపూర్ గ్రామపంచాయతీలు విలీనమవుతాయి. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో.. కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాలు కలవనున్నాయి. నాగారం మున్సిపాలిటీలో బోగారం, గోదాముకుంట, కరీంగూడ, రాంపల్లి దాయార గ్రామాలు విలీనమవుతాయి. పోచారం మున్సిపాలిటీలో.. వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడ విలీనం కానున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాల్టీలో.. అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ విలీనమవుతాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మునీరాబాద్, గౌడవెల్లి పంచాయతీలు, తూంకుంట మున్సిపాలిటీలో.. బొంరాసిపేట, శామీర్ పేట, బాబాగూడ పంచాయతీలు విలీనం కానున్నాయి.విలీన ప్రక్రియతో రెండు, మూడునెలల్లో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలు ఇక్కడి గ్రామాల్లో జరిగే అవకాశం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న మున్సిపాలిటీల పదవీకాలం కూడా వచ్చే ఏడాది జనవరితో పూర్తికానుంది. ఆ తర్వాత ఇప్పుడు విలీనమైన 51 గ్రామపంచాయతీలతో కలిపి ఎన్నికలు నిర్వహించనున్నారు. మరోవైపు పంచాయతీల విలీనంపై ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో విలీనంతో తాము ఉపాధి పనులు కోల్పోవడంతో పాటు.. పన్నుల భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్..

**నేటి నుంచే సిఎం కప్ - 2024 ప్రారంభం**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు సి.ఎం. కప్ - 2024 రాష్ట్రములో నిర్వహిస్తున్నామని నిజామాబాద్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి జే. ముత్తన్న తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనేవారు వెబ్ పోర్టల్ నందు తప్పక తమ పేర్లు, ఇతర వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న సి.ఎం. కప్ - 2024 లో భాగంగా నిజామాబాద్ జిల్లా గ్రామస్థాయి పోటీలు డిసెంబర్ 7 నుంచి 8వ తేదీలో రెండు రోజుల పాటు జరుపుతారు. గ్రామ పంచాయతీస్థాయి క్రీడలు, 1. అథ్లెటిక్స్, 2. ఫుట్బాల్, 3. కబడ్డీ, 4. కోకో, 5. వాలీబాల్, 6. యోగా విభాగాల కింద నిర్వహిస్తారు. విజేతలను మండల స్థాయికి పంపడం జరుగుతుందన్నారు. మండల స్థాయి, నిజామాబాద్ మున్సిపాలిటీ స్థాయిలో డిసెంబర్ 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు (03 రోజులు) నిర్వహిస్తారు. జిల్లాస్థాయి పోటీలు డిసెంబర్ 16 నుంచి 21 వరకు ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబర్ 27 నుంచి జనవరి 2 వరకు ఏడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగే క్రీడలకు పంపనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు వారికి ఆసక్తి ఉన్న క్రీడలో పాల్గొనేందుకు అనే వెబ్ పోర్టల్ నందు క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమో, ఆధార్ కార్డు తప్పనిసరిగా వెబ్ పోర్టల్లో అప్లోడ్ చేసుకోవాలని నిజామాబాద్ జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి జే. ముత్తన్న తెలిపారు. ఇతర వివరాలకు 97011 77144, 98667 70889, 78159 57048 ఈ ఫోన్ నెంబర్లను సంప్రదించాగలరు.

# ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 360 దరఖాస్తులు

**హైదరాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 360 దరఖాస్తులు అందాయి. మైనార్టీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 92, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 80, విద్యుత్ శాఖకు సంబంధించి 56, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 60, ప్రవాసి ప్రజావాణి సంబంధించి 01, ఇతర శాఖలకు సంబంధించి 71 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# అంబేద్కర్ చిత్ర పటానికి కొండా సురేఖ ఘన నివాళి




**వరంగల్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

నేడు డా.బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ వరంగల్ జిల్లా పడమరకోటలోని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, డా. బాబా సాహెబ్ అంబేద్కర్ అంతటి మహోన్నత వ్యక్తి, విద్యావేత్త, మేధావి మన దేశంలో పుట్టి, మనకు ప్రాతినిధ్యం వహించడం మన అదృష్టమని మంత్రి సురేఖ అన్నారు. అంబేద్కర్ లేని భారతదేశాన్ని అసలు ఊహించుకోలేమని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో నెలకొన్న సంక్లిష్టమైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆయన రచించిన రాజ్యాంగం దేశం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్ళకు పరిష్కారాన్ని చూపిందని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 తోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాకారమైందని మంత్రి సురేఖ అన్నారు నాటి కాలంలో కులవివక్ష తీవ్ర నిర్బంధాలు కల్పించినా, అంబేద్కర్ పురోగమనాన్ని ఆపలేకపోయిందని అన్నారు. అదే అంటరానితనం నిర్మూలనకు తన జీవితాంతం ఆయన పోరాడారని మంత్రి గుర్తు చేసుకున్నారు. అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలు ప్రాతిపదికగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం శ్రేయోరాజ్య స్థాపనకు అహర్నిహలు శ్రమిస్తున్నదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదు

**డాలర్ స్థానంలో వేరే కరెన్సీని ఉపయోగించే దేశాలపై పన్నులు**
**డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 6(సమయం న్యూస్):**



అంతర్జాతీయ వ్యాపారంలో డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. డాలర్ స్థానంలో వేరే కరెన్సీని ఉపయోగించే దేశాలపై పన్నులు పెంచుతామని చెప్పారు. అమెరికాకు ఆ దేశాలు ఉత్పత్తి చేసే వస్తువులపై పన్నులు 100 శాతం పెంచుతామని స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాల ప్రయత్నాలను తాము ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటామని, డాలర్‌కు దూరంగా జరిగే దేశాలకు అమెరికా ఆర్థిక వ్యవస్థలో చోటుండదని హెచ్చరించారు. అమెరికాకు ఎగుమతుల విషయం మర్చిపోవాల్సి వస్తుందని వివరించారు. అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సులో అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీ వాడాలని నిర్ణయించాయి. దీనివల్ల స్థానిక కరెన్సీ బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డాయి. ఈ సమావేశంలో ఈజిప్ట్, ఇరాన్, యూఏఈ ఈ ప్రతిపాదనకు అంగీకారం తెలిపాయి. ఓ డిక్లరేషన్‌పై బ్రిక్స్ దేశాలు సంతకం చేశాయి. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ ఇండియా సహా బ్రిక్స్ దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు.

## డీప్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు : నారా చంద్రబాబునాయుడు

**అమరావతి,డిసెంబర్ 6 (సమయం న్యూస్):**

ఏపీలో డీప్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సీఎం చంద్రబాబు అన్నారు. వంద శాతం గ్రీన్ ఎనర్జీకి వెళ్ళాలి అనేది మా ప్రభుత్వం లక్ష్యమని వెల్లడించారు. విశాఖపట్నంలో నిర్వహించిన డీప్‌టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ మారాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం సాంకేతికతను అందిపుచ్చుకుంటుందని పేర్కొన్నారు. టెక్నాలజీ జీవితంలో ఒక భాగంగా మారిందని అన్నారు. ఐటీ, నాలెడ్జ్ ఎకానమీలో యువత సమర్థులుగా మారుతున్నారని, విదేశాల్లోని మన దేశ ఐటీ నిపుణులుల్ల 30శాతం తెలుగువారే ఉండడం గర్వకారణమని వెల్లడించారు. ఎన్ని ఎక్కువ ఉద్యోగాలు ఇస్తే, అన్ని ఎక్కువ రాయితీలు మా ప్రభుత్వం ఇస్తుందని , పెట్టుబడులతో వస్తున్న వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. నదుల అనుసంధానంతో నీటి కొరత అనేదే ఉండదు. ఆహార ఉత్పత్తులు, సరఫరాలో గ్లోబల్ హబ్ గా ఏపీ మారబోతోందని తెలిపారు. అరకు కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందని అన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో నిజామాబాద్ జిల్లా పనితీరు భేష్






**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి**
**సి.సుదర్శన్ రెడ్డి కితాబు**
**ఈ.ఆర్.ఓ కార్యాలయాలు,**
**ఈవీఎం గోడౌన్‌ల సందర్శన**
**రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమీక్ష**

**నిజామాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాల అమలులో నిజామాబాద్ జిల్లా యంత్రాంగం పనితీరు భేషుగ్గా ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) సి.సుదర్శన్ రెడ్డి ప్రశంసించారు. ఇతర అన్ని జిల్లాలతో పోలిస్తే ముసాయిదా ఓటరు జాబితా రూపకల్పన, మార్పులు, చేర్పులకు సంబంధించి దాఖలైన దరఖాస్తుల పరిష్కారం, రికార్డుల నిర్వహణలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రత్యేక చొరవ చూపుతున్నారని సంతృప్తి వెలిబుచ్చారు. జిల్లా పర్యటనకు హాజరైన సీఈఓ సుదర్శన్ రెడ్డి శుక్రవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి నిజామాబాద్ నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో కొనసాగుతున్న నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఈ.ఆర్.ఓ ఆఫీసును, బోధన్ లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గల బోధన్ నియోజకవర్గ ఈ.ఆర్.ఓ ఆఫీసులను సందర్శించారు. నోటీసు బోర్డులపై అతికించిన ముసాయిదా ఓటరు జాబితాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, చిరునామాల మార్పు, పేర్ల తొలగింపు తదితర వాటికి సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంలో మార్గదర్శకాలు పాటించారా లేదా అని రికార్డులను పరిశీలించి నిర్ధారణ చేసుకున్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం ఆన్లైన్, ఆఫ్ లైన్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఈ.ఆర్.ఓలకు కీలక సూచనలు చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థలలో కొనసాగుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల నుండి వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, బోధనేతర విధుల్లో కొనసాగే వారి పేర్లు ఎమ్మెల్సీ ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటరు జాబితాలో ఉండకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని హితవు పలికారు. ఓటరు జాబితా నుండి మృతి చెందిన వారి పేర్లు తొలగించే సందర్భంలో మరణ ధ్రువీకరణ పత్రం జత చేయాలని, కుటుంబ సభ్యుల నుండి నిరభ్యంతర పత్రం తీసుకోవాలని సూచించారు. జిల్లాకు ఆనుకుని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం ఉన్నందున, పొరుగు రాష్ట్రంలో ఓటు హక్కు కలిగి ఉన్న పలువురు స్థానికంగా కూడా ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపిన మీదట అర్హులైన వారి దరఖాస్తులను మాత్రమే ఆమోదించాలని అన్నారు. అనంతరం సీఈఓ వినాయకనగర్ లోని ఈవీఎం గోడౌన్ ను సందర్శించి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బీ.యూలు, సీ.యులు, వీవీ.ప్యాట్ ల భద్రత ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. సీసీ కెమెరాలు సక్రమంగానే పని చేస్తున్నాయా లేదా అని గమనించారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లు కలిగి ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిజామాబాద్ అర్బన్, రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో సీఈఓ సమీక్ష జరిపారు. ఎస్.ఎస్.ఆర్ ప్రక్రియలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల గురించి కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సీఈఓ కు వివరించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాలు సజావుగా జరుగుతున్నాయని, ఇకముందు కూడా ఇదే తరహా శ్రద్ధ చూపాలని అన్నారు. ఎన్నికల నిర్వహణ సమయంలో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, శాసనసభ, పార్లమెంటు సాధారణ ఎన్నికలు ముగిసినందున ప్రస్తుతం లభించిన వెసులుబాటును సద్వినియోగం చేసుకుంటూ ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా ఓటరు జాబితా రూపొందేలా కృషి చేయాలని హితవు పలికారు. ఒక కుటుంబానికి చెందిన సభ్యులందరు ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఓటు హక్కు కలిగి ఉండేలా చూసుకోవాలని, చిరునామాలో తప్పులు, మార్పులు ఉంటే సరిచేసుకోవాలని, ఓటరు లిస్టులో ఫోటో స్పష్టంగా ఉండాలని అన్నారు. ఎస్ఎస్ఆర్ లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల గురించి ఎప్పటికప్పుడు రాజకీయ పార్టీలకు సమాచారం తెలియజేయాలని, క్రమం తప్పకుండా వారితో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాల్సిందిగా గుర్తింపు పొందిన పార్టీలకు తెలియజేయాలని అన్నారు.

**ఈ నెల 9 వరకు ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు అవకాశం : కలెక్టర్**

నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు చెందిన అర్హత కలిగిన ఓటర్లు ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు జాబితాలో పేర్ల నమోదు కోసం ఈ నెల (డిసెంబర్) 9 వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఈ సందర్భంగా సూచించారు. ఆన్లైన్ లో లేదా ఏఈఆర్ఓ కార్యాలయాల్లో నేరుగా కూడా ఓటర్లు దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మరోసారి తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాల్సి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అర్హులైన ఓటర్లు జాబితాలో పేర్ల నమోదు కోసం గడువు లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్, బాన్సువాడ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, కిరణ్మయి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్ తదితరులు ఉన్నారు.

# పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**సంగారెడ్డి, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

పాఠశాలల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్, కళాశాలలు, కేజీబీవీ (కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు) , సాంఘీక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ వసతి గృహాలలో మౌలిక వసతుల అభివృద్ధిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, టీడబ్ల్యూఈఐడీ ఇంజనీరింగ్ అధికారులు, వసతి గృహ అధికారులతో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ , ప్రతీ విద్యాసంస్థలో తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికలను సమర్పించాలన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన పనుల వివరాలను సమర్పించాలని వసతిగృహ అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, టీడబ్ల్యూఈఐడీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంకా పూర్తి కాలేని పనులను గుర్తించి, వాటి ప్రాధాన్యతను బట్టి నివేదికలు తయారు చేయాలని సూచించారు. పాఠశాలల్లో జరిగిన మరమ్మతులు నివేదికలు అందించాలని తెలిపారు. కొన్ని పాఠశాలల్లో రిపేర్లు ఇంకా మిగిలి ఉన్నాయని గుర్తించి, వాటిని సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పాఠశాలల్లో నీటి సరఫరా, మరుగుదొడ్లు, భవనాలు, విద్యుత్ సరఫరా వంటి అంశాలను పరిశీలించి వాటి మెరుగుపరిచే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.వసతిగృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని ఆదేశించారు. భోజనం నాణ్యతను పరిశీలించడానికి అధికారుల తరచు సందర్శనలు చేయాలని సూచించారు. వసతిగృహాల్లో శుభ్రత పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ప్రతి రోజు శుభ్రతను పరిశీలించాల్సిన బాధ్యత ఎంపీడీవోలకి, గ్రామ పంచాయతీ సెక్రెటరీలకు ఉందని ఆమె స్పష్టం చేశారు.పాఠశాల ప్రాంగణంలో ఉన్న పిచ్చిమొక్కలు, చెత్త, అపరిశుభ్రతను తొలగించాల్సిన భాధ్యత ఎంపీడీఓలు,పంచాయతీ సెక్రిటర్లదేనని కలెక్టర్ స్పష్టం చేశారు . ఈ పనిని పంచాయతీరాజ్ అధికారులు, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయుల సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా శానిటేషన్ అంశంపై సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆమె సూచించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ,ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఈఈపి ఆర్. జగదీష్, డిఇఓ వెంకటేశ్వర్లు, వెనుకబడినతరగతుల సంక్షేమశాఖ జగదీశ్, ఆర్‌సిలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో చాలా అద్భుతంగా కాంగ్రెస్ పాలన

**ఓర్వలేక బీఆర్ఎస్ ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతుంది**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు కానుంది. బీఆర్ఎస్ నేతల విమర్శలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన చాలా అద్భుతంగా కొనసాగుతోందని.. అది ఓర్వలేక బీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నా భిన్నం చేసిందని మండి పడ్డారు. ప్రజలపై భారం వేయకుండా ఆర్థిక శాఖను ముందుకు కొనసాగిస్తున్నాం అన్నారు. ప్రపంచ వాతావరణం వల్ల గ్రీన్ ఎనర్జీ పై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టిందని.. త్వరలోనే కొత్త విద్యుత్ పాలసీ తీసుకురాబోతునాం అని భట్టి విక్రమార్క అన్నారు.గత ప్రభుత్వం విద్యుత్ శాఖలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం అని తీవ్రంగా మండిపడ్డారు. ఒక్క యాద్రాద్రి భద్రాద్రి పవర్ ప్లాంట్ల వద్ద గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల ప్రతి ఏటా 170 కోట్లకు పైగా భారం పడిందన్నారు. కొంతమంది స్వార్థం వల్ల విద్యుత్ రంగంలో ఆర్థిక భారం పడుతుందని భట్టి అన్నారు. ఛత్తీస్ ఘడ్ ఒప్పందాల వల్ల 630 ఆర్థిక భారం ప్రభుత్వం పై పడుతుందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిచేసి యాదద్రిలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అనుసంధానం చేయబోతున్నాం అని అన్నారు. గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల వల్ల విద్యుత్ డిస్కంల పై దాదాపుగా 10వేల కోట్ల భారం పడుతుందని విమర్శలు గుప్పించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 24 గంటల కరెంటు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. 50లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. భవిష్యత్తులో అన్ని రకాల విద్యుత్ ఉత్పత్తి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో కరెంట్ కోతలు లేకుండా చర్యలు తీసుకున్నామని. అన్ని రంగాలతో కూడిన విజన్ డాక్యుమెంట్ ప్లానింగ్ డిపార్ట్మెంట్ తయారు చేస్తోందన్నారు. ఈ సందర్భంగా 1.28 కోట్ల దరఖాస్తులు ప్రజా పాలనలో వచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు.

www.epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
సామాన్యుల గళం
తెలుగు దినపత్రిక

# పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**
**మొబైల్ యాప్ సర్వే విధానంపై అవగాహన సమావేశం**

**నిజామాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపల్ డివిజన్లు, వార్డులలో క్షేత్రస్థాయిలో చేపట్టే సర్వే ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహించాల్సిన విధానంపై మున్సిపల్ కమిషనర్లు, ఆయా మండలాల ఎంపిడిఓలు, తహశీల్దార్లకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. మొబైల్ యాప్ ను వినియోగిస్తూ క్షేత్రస్థాయిలో సర్వే చేయాల్సిన తీరును ఒక్కో అంశం వారీగా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఏయే అంశాలను పరిశీలించాలి, మొబైల్ యాప్ లో వివరాలను ఏవిధంగా పొందుపర్చాలి అనే అంశాలను పీ.పీ.టీ ద్వారా ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయి సర్వే కోసం ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఇతర సిబ్బంది అందరికి యాప్ ద్వారా సర్వే జరపాల్సిన విధానంపై శనివారం అన్ని మండలాలలో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని ఎంపిడిఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. సర్వే సందర్భంగా దరఖాస్తుదారుల వివరాలను పక్కాగా సేకరిస్తూ, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా యాప్ లో వివరాలను అప్లోడ్ చేయాలని సూచించారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరపాలని అన్నారు. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించిన కలెక్టర్, ఇదివరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరీలో చోటుచేసుకున్న పరిణామాల గురించి ఈ సందర్భంగా ఉటంకించారు. ఎలాంటి వివాదాలు, అవకతవకలకు తావులేకుండా సర్వే ప్రక్రియను నిజాయితీగా, నిబద్ధతతో చేపడుతూ గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. అవగాహన సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఆర్డీఓ సాయాగౌడ్, నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీఓలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.




# మనిషి అంకిత భావం, మంచి లక్ష్యంతో పని చేయడం ఎంతో సంతోషం

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

మనిషి అంకిత భావం, మంచి లక్ష్యంతో పని చేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రులు దామోదర రాజనరసింహ, సుద్దీళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావులు కొడంగల్ నియోజక వర్గంలో 76 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. వికారాబాద్ జిల్లాలో 24.11 కోట్ల వ్యయంతో చేపట్టే పలు పనులకు శంకుస్థాపన గావించారు. ఇందులో బొమ్మరాస్ పేట్ మండలంలో 267.50 లక్షలు, దౌల్తాబాద్ మండలం 413.10 లక్షలు, దుద్యాల్ మండలం 13.54 కోట్లు, కొడంగల్ మండలం 376 లక్షల వ్యయంతో చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం హరికృష్ణ మూవ్ మెంట్ చారిటేబుల్ ఫౌండేషన్ అల్పాహార వంటశాల ప్రారంభించిన అనంతరం ఫౌండేషన్ తెలంగాణ అధ్యక్షులు సత్య గౌరచంద్ర దాస అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. విద్యా, వైద్యం ద్వారా సామాన్య ప్రజానీకానికి సేవ చేయడం అదృష్టకరమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కి విద్యా వైద్యం పట్ల స్పష్టమైన అవగాహన ఉందని, ఆదిశగానే ముఖ్యమంత్రి చొరవ సహకారంతో ఉన్నత ప్రమాణాలతో , అన్ని సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా అమ్మాయిలు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన అభిప్రాయపడుతూ.. మీకు మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించేందుకు ముందుకు వచ్చిన హరికృష్ణ మూవ్ మెంట్ చారిటేబుల్ ఫౌండేషన్ సేవలను మంత్రి అభినందియమన్నారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాలైనా కొడంగల్, బొమ్మరాస్ పేట్, దూద్యాల్ , దౌల్తాబాద్, నారాయణ పేట జిల్లాలోని గుండుమల్ , కోస్గి, కొత్తపల్లి, మద్దూరులాలోని 312 ప్రభుత్వ పాటశాలలోని 28 వేల మంది విద్యార్థులకు అల్పాహారాన్ని అందించడం మంచి పరిణామానికి నిదర్శనమని మంత్రి తెలిపారు. వికారాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి, ఐటీ, పరిశ్రమల శాఖ దుద్దీల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. విద్యా విధానంలో ఎన్నో మార్పులు తీసుకొస్తూ , విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వ కృషి చేస్తుందన్నారు. దేశంలో ఎన్నో ప్రాంతాల్లో బృహత్తర కార్యక్రమాలు చేపడుతున్న హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ కు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వెనుకబడి ఉన్న పాలమూరు జిల్లాను అభివృద్ధిపరిచేందుకు ఎన్నో ప్రణాళికతో ముందుకు వస్తున్నారని ఆయన తెలిపారు . పారిశుద్ధ్య పనులతో పాటు రైతాంగ సోదరులకు సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. రాబోయే నాలుగు సంవత్సరాల్లో మంచి ప్రణాళికలతో రాష్ట్ర అభివృద్ధికి వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చదువు చూపుతుందని ఆయన వెల్లడించారు. పర్యాటక, సాంస్కృతి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... వెనుకబడిన ప్రాంతమైన పాలమూరుకు మహర్దశ ప్రారంభమైందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పక్కా ప్రణాళికతో సాగునీటి ప్రాజెక్టులతో రైతులకు సాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. హరే కృష్ణ మూమెంట్ సేవలు రాష్ట్ర నలుమూలల రావాలని తన కోరికను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, శాసనసభ్యులు రామ్మోహన్ రెడ్డి, వీర్లపల్లి శంకర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, వయట్రీస్ హెడ్ మిచెల్ డొమినికా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన విజయోత్సవ సభలో పాల్గొన్న గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

తాండూరు మున్సిపాలిటీ ఆద్వర్యంలో ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన ప్రజా పాలన విజయోత్సవ సభలో ముఖ్య అతిధిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్. పాల్గొన్న శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తాండూరు శాసనసభ్యులు బి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ స్వప్న మరిమళ్ల, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. శుక్రవారం ముందుగా తాండూరు పట్టణంలోని మెటర్నిటీ & చైల్డ్ హాస్పిటల్ లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించారు. మహిళా సంఘాల ఉత్పత్తుల స్టాళ్ళు ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర, తాండూరు నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నారు. త్వరలోనే ఆరు గ్యారంటీల అమలుతో పాటుగా ఇచ్చిన అన్ని హామీలను అందిస్తామన్నారు. ఏడాది క్రితం మనసులో మార్పు కోరుకుని ఓటుతో తీర్పు ఇచ్చి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని నేడు ప్రజలు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందుకుంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తుంది, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, ఉచిత కరంటు, ఆరోగ్య శ్రీ పది లక్షలకు పెంపు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ అమలు అయ్యాయి. రెండు లక్షల రైతు రుణమాఫీ దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. 25 లక్షల 36 వేల మంది రైతులకు ఇరవై వేల 617 కోట్ల రూపాయలు చెల్లించారు. రుణమాఫీ తో పాటుగా పెట్టుబడి సహాయం, రైతు బీమా, పంటల బీమా, అకాల వర్షాలకు నష్టపరిహారం, ఉచిత విద్యుత్తు, సన్న వడ్లకు బోనస్ ఇలా ఒక్క ఏడాది లోనే వ్యవసాయ రంగానికి యాబై ఏడు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చాక గత ఏడాదిలో 55,143 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిందని, దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఒక్క ఏడాదిలో ఇన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వలేదని అన్నారు. పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి అండగా కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకంలో భాగంగా ఇస్తున్న లక్షా పదహార్లకు గత ఏడాదిలో రాష్ట్ర వ్యాప్తంగా మీకు ఇచ్చిన మొత్తం అక్షరాల 2,311 కోట్ల రూపాయలు. గత ఏడాదిలో నెలా నెలా పెన్షన్లకు ఇస్తున్న మొత్తం 11,382 కోట్లు. సబ్సిడీ గ్యాప్ సిలెండర్ కు 442 కోట్లు, గృహజ్యోతి పథకంలో యాబై లక్షల ఇళ్ళకు 200 యూనిట్ల వరకు సబ్సిడీకి ఇచ్చిన మొత్తం 1,234 కోట్లు, ఉచిత బస్సు ప్రయాణం 1,375 కోట్లు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి పదివేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. 22,500 కోట్లతో నాలుగు లక్షల యాబైవేల ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు అయ్యాయన్నారు. పదేళ్ల తర్వాత ప్రభుత్వ హాస్టల్ లలో డైట్ చార్జీలు నలబై శాతం పెంచింది. ఈ ఏడాదిలో స్కాలర్ షిప్స్, డైట్, కాస్మోటిక్ చార్జీల కోసం వెయ్యి కోట్ల కు పైగా ఖర్చు చేసిందన్నారు. ఆర్థిక సంక్షోభాన్ని సరిదిద్దుతూ ఉన్న వనరులను సమర్ధవంతంగా వాడుకుంటూ గత ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో సంక్షేమ కార్యక్రమాల కోసం ఒక్క ఏడాదిలో పదేళ్ల ముందుకు తీసుకుపచ్చరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్ధవంతంగా పనిచేయబట్టే ఇది సాధ్యమైంది. రాష్ట్రంలో ఏడాదిలో కొత్తగా ఎనిమిది మెడికల్ కాలేజీలు మంజూరు అయ్యాయి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. వైయస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మహిళలను ఆర్థికంగా పటిష్ఠం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి, ప్రభుత్వ నాయకత్వంలో అలాంటి ప్రయత్నం మొదలైందన్నారు. నేను పుట్టిన ప్రాంతం తాండూరు, తాండూరు అభివృద్ధికి నా వంతుఅన్ని రకాలుగా సహకారం అందిస్తాను అన్నారు. తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తాండూర్ మున్సిపాలిటీలోని డ్వాక్రా సంఘాల పనితీరు, వారి ఉత్పత్తులు బాగున్నాయి అన్నారు. మున్సిపాలిటీ డ్వాక్రా సంఘాల మహిళలకు మరో 23 కోట్ల ఆర్థిక సాయం అందిస్తున్నాం. అభివృద్ధి నిరంతర ప్రక్రియ. సీఎం రేవంత్ రెడ్డి అతి తక్కువ కాలంలో వేలకోట్లతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారు. తాండూర్ డిపో ద్వారా 35 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారు. 200 యూనిట్ల వరకు ఇళ్లకు ఉచిత విద్యుత్తు అందించిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కిందన్నారు. రైతులకు రెండు లక్షల రుణాలను సీఎం మాఫీ చేశారు. తాండూర్ నియోజకవర్గ అభివృద్ధికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో కలిసి నిధులను సేకరిస్తామన్నారు.



# తెలంగాణకు రెండు పత్తి పరిశోధన కేంద్రాలు..!!

**వరంగల్, ఆదిలాబాద్‌లకు కేటాయింపు మంజూరు చేస్తూ ఐసీఏఆర్ లేఖ**
**వరంగల్, ఆదిలాబాద్‌లకు కేటాయింపు**

**హైదరాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

తెలంగాణలో రెండు అఖిల భారత పత్తి పరిశోధన సమన్వయ కేంద్రాలకు (ఏఐసీఆర్ పీ) భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఆమోదం తెలిపింది. ఈ కేంద్రాలను మంజూరు చేస్తున్నట్లు ఐసీఏఆర్.. జయశంకర్ యూనివర్సిటీ ఉప కులపతికి అధికారికంగా లేఖ రాసింది. నూతనంగా నియమితులైన ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య గత నెలలో ఢిల్లీలోని ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.టి.పి శర్మలను కలిశారు. అఖిల భారత పత్తి సమన్వయ పరిశోధన పరిశోధన పథకంలో యూనివర్సిటీకి భాగస్వామ్యం కల్పించి... వరంగల్‌లో ప్రధాన కేంద్రం, ఆదిలాబాద్‌లో ఒక ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఈ విజ్ఞప్తికి ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సానుకూలంగా స్పందించి కేంద్రాలను వెంటనే మంజూరు చేస్తున్నట్లు గురువారం ఉప కులపతికి లేఖను పంపించారు.

# అంబేద్కర్ వర్ధంతి రోజునే గోశాలపై కిరాయి గుండాల దాడి

**గోశాల నేలమట్ట చేసిన గుండాలు**
**కోర్టు ఉత్తర్వుల బేఖాతర్, ఆశ్రయం కోల్పోయిన గోవులు**

**హైదరాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి రోజున గోశాల పై కిరాయి గుండాలు జేసీబీ లతో దాడులు చేసి విధ్వంసం చేసి గోశాలను పూర్తగా నేలమట్టం చేసి గోవులకు నిలువ నీడ లేకుండా చేసిన సంఘటన శుక్రవారం ఆలేరు మండలం బహదూర్ పెట్ట గ్రామంలో చోటుచేసుకుంది. ఆలేరు మండలం బహద్దుర్ పేట గ్రామంలోని సర్వే నెంబర్ 88లో అదే గ్రామానికి చెందిన గోవిందు రాజుల మాధవి గత మూడు సంవత్సరాల క్రితం తన సొంతానికి కు చెందిన వ్యవసాయ భూమిలో వాళ్ళ తాత అమ్మమ్మ జ్ఞాపకార్థం సారబుడ్ల సావిత్రమ్మ లక్ష్మారెడ్డి గోశాల రిజిస్ట్రేషన్ నెంబర్ 592/22 నమోదు గోశాలను ప్రారంభించారు. ఈ యొక్క భూమిలో గోవులకు పెద్ద రేకుల షెడ్డు వేసి, గోవులకు వినియోగించే దాణ కోసం ఒక పెద్ద కంటైనర్ ను ఏర్పాటు చేసి, గో ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఈ గోశాలలో ఆరు ఆవులను పోషిస్తున్నారు. మిగతా భూముల్లో గోవులకు పశుగ్రాసం ఏర్పాటుచేసి గోశాల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ గోశాలలో ప్రతిరోజు గోవులకు క్రమం తప్పకుండా వేద పండితులతో పూజలు నిర్వహిస్తు బహుదూర్పేట గ్రామంలో ప్రజలకు ఆధ్యాత్మికత అవశ్యత. హిందూ, సనాతన ధర్మంపై పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.

**గోశాలపై కిరాయి గుండాల దాడి..**

గ్రామంలో నిర్విరామంగా నిర్వహిస్తున్న సారబుడ్ల సావిత్రమ్మ లక్ష్మారెడ్డి గోశాలపై బహదూర్ పేట గ్రామానికి చెందిన కుళ్ళ నర్సింహులు అనే వ్యక్తి వందమంది కిరాయి గుండాలను జెసిబిలతో గోశాలపై దాడికి ఉసిగొలి పాడు. దీంతో వంద మంది కిరాయి దుండగులు జెసిబి ల తో గోశాల మీద పడి దాడి చేసి గోవులను చెల్లాచెదను చేసి గోశాలను, పశు గ్రాశాన్ని పూర్తిగా నేలమట్టం చేశారు.

**కోర్టు ఉత్తర్వులు అతిక్రమించి..**

గోశాలకు సంబంధించిన భూమి విషయమై ఆలేరు సివిల్ కోర్టు యందు గోశాల నిర్వాహకురాలు గోవిందరాజుల మాధవి ఓ ఎస్ నెంబర్ 67/2022 ద్వారా ఇంజక్షన్ ఆర్డర్ పొంది ఉన్నారు. కోర్ట్ మంజూరు చేసిన ఇంజక్షన్ ఆర్డర్ ను సైతం అతిక్రమించి దుండగులు గోశాలపై దాడి చేసి ధ్వంసం చేశారు. వీరికి స్థానిక కాంగ్రెస్ నేతల అండదండలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. భూమిని కాజేయాలనే ఉద్దేశ్యంతో గోవులకు నిలువ నీడలేకుండా చేశారని తెలుస్తోంది.

**పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు..**

గోశాలపై దాడి చేసి గోశాలను పూర్తిగా మట్టం చేసిన దుండగులపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ పార్టీల చెందిన నాయకులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

# అన్ని రంగాల్లో కాంగ్రెస్ మార్క్ పాలన

**కేసీఆర్ కుటుంబం పదేళ్ల పాటు తెలంగాణను దోచుకుంది**
**బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 50 వేల ఉద్యోగాలే ఇచ్చింది**
**తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

కేసీఆర్ కుటుంబం పదేళ్ల పాటు తెలంగాణను దోచుకుందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 50 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని విమర్శించారు. కానీ తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 50 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ కాంగ్రెస్ మార్క్ పాలన కనిపిస్తోందన్నారు.ప్రజాపాలన పండుగలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన దోపిడీ అంతా ఇంతా కాదన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. లక్షల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన మీకు ప్రజలు మళ్లీ అధికారం ఇస్తారా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని కేటీఆర్ చెబుతున్నారని, కానీ రాజీవ్ గాంధీ, ఆయన కుటుంబం చేసిన త్యాగం తెలుసా? అని ప్రశ్నించారు. వారి కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించిందన్నారు. తెలంగాణ కోసం కేటీఆర్ చేసిన త్యాగం ఏమిటో చెప్పాలని నిలదీశారు. భూములు, నిధులు, నియామకాల పేరుతో కేసీఆర్ కుటుంబం అడ్డంగా దోచుకుందని ధ్వజమెత్తారు.



www.epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
సామాన్యుల గళం
తెలుగు దినపత్రిక



# కోటి మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం






### మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తుంది : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

### ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన మేయర్

**హైదరాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో వ్యాపారవేత్తలుగా తమదైన రంగంలో రాణించి ఉన్నతంగా ఎదగాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ జోనల్ కార్యాలయం వద్ద ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాజిక ఆర్థిక స్థిరత్వం సాధించడంలో మహిళల పాత్ర కిలకమైనదని, వారు సామర్థ్యాలను పెంపొందించుకుని సొంత వ్యాపారాల్లో నిలదొక్కుకోవడం ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చని అన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ మహిళల ఆర్థిక స్థితి మెరుగుపరిచేందుకు, వారి జీవనోపాధి అవకాశాలను పెంపొందించేందుకు సహాయపడుతుందన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా సంబంధిత గ్రూపు మహిళలు సమిష్టిగా తాము లబ్ధి పొందుతూ, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆశించారు. క్యాంటీన్ ద్వారా ప్రజలకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని సూచించారు.జి హెచ్ ఎం సి వ్యాప్తంగా మరిన్ని క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు సందర్భంగా మొట్టమొదటి మహిళ క్యాంటీన్ ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం మేయర్ సంగీత్ జంక్షన్, వైఎంసిఏ వద్ద రూ.38.51 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన స్మార్ట్ ఎల్ఈడి స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు వేగవంతం చేసి, ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. సౌకర్యాల కోసం ప్రభుత్వం అత్యుత్తమ సాంకేతికతను వినియోగించుకుంటూ నగరాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తుందని అన్నారు. ఈ స్ట్రీట్ లైట్లు రహదారి భద్రత దృష్ట్యా, రాత్రి సమయంలో ప్రజల రక్షణ కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం విశేష కృషి చేతున్నందని అన్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళని ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఎంత ఖర్చైనా వెనికాడ లేదని చెప్తున్నారని నియోజవర్గ మహిళా సంఘాలు వ్యాపారం చేయడానికి ముందుకు వస్తే సహకరించడం జరుగుతుంది ఆయా కార్యాలయంలో వ్యాపారం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తామని ఆయన అన్నారు జోనల్ కమిషనర్ రవి కిరణ్, స్థానిక కార్పొరేటర్లదీపికబేగంపేట్ సర్కిల్ డి సి సమ్మయ్య,, యూసి డి ప్రాజెక్టు అధికారి శ్రీనాథ్ ఆయా విభాగాల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## 7,8,9 తేదీలలో జరిగే కార్యక్రమాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



**హైదరాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా విజావిజయోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా డిసెంబర్ 7,8,9 తేదీలలో జరిగే కార్యక్రమాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ముగింపు వేడుకల ఏర్పాట్ల పై ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మూడు రోజులు జరిగే కార్యక్రమాలపై ప్రింట్, లక్ట్రానిక్, సోషల్ మీడియాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హరీష్‌ను ఆదేశించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ముగింపు వేడుకలకు ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, తాగునీరు, టాయిలెట్స్ మొదలగు మౌళిక వసతుల ఏర్పాటు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ట్యాంక్ బండ్ వద్ద 8 వ తేదీన జరిగే ఎయిర్ షో కు భారత వైమానిక దళం అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. 09 వ తేదిన ట్యాంక్ బండ్ పై నిర్వహించే డ్రోన్ షో కూ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రముఖ సంగీత కళాకారులు వందేమాతరం శ్రీనివాస్, రాహుల్ సిప్లీగంజ్, ప్రముఖ సినీ సంఘీత దర్శకులు థమన్ ల సంగీత కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వేదికల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. కళాకారుల సౌకర్యార్థం వారికి ప్రత్యేక గ్రీన్ రూం ఏర్పాటుతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలను అందరూ వీక్షించేందుకు వీలుగా రోడ్డుకు ఇరు వైపులా ఎల్ ఈ డి స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. డిసెంబర్ 09 వ తేదిన సచివాలయ ప్రాంగణంలో జరిగే తెలంగాణ తల్లి విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమం, బహిరంగ సభలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. బహిరంగ సభకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తో పాటు, మంత్రులు, ప్రముకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యేక భద్రతా ఏర్పాట్లను చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస రాజు, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్త, డిజిపి జితేందర్, మున్సిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి దాన కిషోర్, జీఏడి కార్యదర్శి రఘునందర్ రావు , జీహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి, సెర్ప్ సీఈఓ దివ్య, సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ హరిష్, మెట్రో వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరిక్రిష్ణ వైమానిక దళ అధికారులు పాల్గొన్నారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా కలెక్టర్ హనుమంతరావు




**హైదరాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

శుక్రవారం, ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలసి జ్యోతి ప్రజ్వలన గావించి యోగా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో యోగ చాలా ముఖ్యమైందని తెలిపారు.జీవితంలో సాధించాలంటే మొదట ఆరోగ్యంగా ఉండాలన్నారు. యోగా వల్ల మానసిక పరిపక్వతతో పాటు శారీరక ఆరోగ్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ఈ యోగా అనేది ఒక్క రోజుకే పరిమితం కాదని, సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయాలని సూచించారు. విద్యార్థి దశ నుండే విద్యార్థులకు యోగ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పాఠ్యాంశాలలో కూడా యోగ యొక్క ప్రాముఖ్యత గురించి పొందుపరచాలన్నారు. యోగా వలన మెదడుకు ఆక్సిజన్ సంపూర్ణంగా అందుతుందన్నారు. ఉద్యోగంలో పని ఒత్తిడి తగ్గించుకోవాలంటే యోగా వలన ఒత్తిడిని తగ్గించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా రెవిన్యూ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా యూత్ వెల్ఫేర్ అధికారి ధనంజేయ, యోగ మాస్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

కుత్బుల్లాపూర్ దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎంఎల్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువు తున్న శ్రావణి (18) హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య.శ్రావణి తల్లితండ్రులకు కనీస సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించిన కళాశాల యాజమాన్యం.. ప్రాదమిక దర్యాప్తులో వికారాబాద్ జిల్లా మైలారం కొత్త తండా ధరూర్ మండలం కు చెందిన బలరాం, కవిత పెద్ద కూతురు శ్రావణిగా గుర్తించారు. తమ కూతురు ఆత్మహత్య చేసుకొనంత పిరికిది కాదని కళాశాల లో ఏం జరిగిందో తెలిపాలి మాకు న్యాయం చేయాలని ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ఆవరణలో మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. దీంతో దుండిగల్ పోలీసులు భారీగా మోహరించారు.

## విజయవంతంగా సాగుతున్న ప్రజా పాలన కళా యాత్ర

### రెండు బృందాలుగా ఏర్పడి 108 ప్రాంతాలలో కార్యక్రమాల పూర్తి

### ప్రతి బృందం రోజుకు 3 గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ






**పెద్దపల్లి, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

పెద్దపల్లి జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే ప్రజా పాలన కళా యాత్ర విజయవంతంగా సాగుతుంది. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు నవంబర్ 19 నుంచి డిసెంబర్ 7 వరకు ప్రతి రోజు 3 గ్రామాలలో పర్యటిస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, రైతు భరోసా, రైతు రుణమాఫీ యువతకు ఉపాధి అవకాశాలు, స్కిల్ యూనివర్సిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇందిరా మహిళా శక్తి , 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా, 500 రూపాయల బోనస్ వంటి వివిధ ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని ప్రతి మండల కేంద్రం మేజర్ గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ లను కవర్ చేసేలా జిల్లాలో ఉన్న 20 తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులను రెండు బృందాలుగా విభజించి ప్రతి బృందం రోజుకు మూడు ప్రాంతాల్లో కళా ప్రదర్శనలు చేసేలా కార్యాచరణ రూపొందించడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 19న ప్రారంభమైన ప్రజాపాలన కళా యాత్ర కార్యక్రమం డిసెంబర్ 7 వరకు జరుగుతుంది. జిల్లాలో ఇప్పటి వరకు ఎలిగేడు ,రామగిరి, జూలపల్లి ,సుల్తానాబాద్ కాల్వ శ్రీరాంపూర్, ఓదెల, పెద్దపల్లి, మంథని ముత్తారం, కమాన్ పూర్, మంథని, పాలకుర్తి, అంతర్గం , ధర్మారం మండలాల్లో, పెద్దపల్లి మున్సిపాలిటీ, మంథని మున్సిపాలిటీ రామగుండం కార్పొరేషన్ , సుల్తానాబాద్ మున్సిపాలిటీ ప్రజా పాలన కళా యాత్ర పూర్తి చేసుకుంది. జిల్లాలో ఇప్పటి వరకు ప్రజాపాలన కళా యాత్ర తెలంగాణ సాంస్కృతిక సారథి రెండు బృందాల ద్వారా 108 ప్రాంతాలలో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజా ప్రభుత్వం లక్ష్యాలు, రైతు బాగు కోసం తీసుకుంటున్న చర్యలు, మహిళలను కోటీశ్వరుల్ని చేసే దిశగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి వంటి కార్యక్రమాల గురించి అవగాహన కల్పిస్తున్నారు.

## అవినీతి వ్యతిరేక వారోత్సవాల ర్యాలీని ప్రారంభించిన వరంగల్ పోలీస్ కమిషనర్



**హైదరాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేది నుండి 9వ తారీకు వరకు నిర్వహిస్తున్న అవినీతి వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఏర్పాటు చేసిన ర్యాలీ ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. హనుమకొండ జూనియర్ కాలేజీ నుండి హనుమకొండ చౌరస్తా వరకు ఈ ర్యాలీ ని నిర్వహించారు.విద్యార్థి దశ నుండి అవినీతిని వ్యతిరేకించాలని, లంచం తీసుకోవడం,ఇవ్వడం. నేరమని సిపి తెలిపారు. ఈ కార్యక్రమం సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీబి డి.ఎస్పీ సాంబయ్య, ఇన్స్పెక్టర్ సట్ల రాజు తో కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సెలబ్రిటీలు, వ్యాపారవేత్తలను మోసం చేసిన కాంతి దత్‌కు ఒక రోజు పోలీసు కస్టడీ

**హైదరాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**



ఫోర్జరీ కేసులో తృతీయ జ్యూవెలరీ అధినేత కాంతి దత్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో విచారణ కోసం కస్టడీకి ఇవ్వాలని పిటిషన్ వేశారు. ఒకరోజు కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా కాంతిదత్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు విచారించనున్నారు. కాంతి దత్ బాధితుల్లో బాలీవుడ్ హీరోయిన్ పరిణీతి చోప్రా, హీరోయిన్ సమంత.. కీర్తి సురేష్.. డిజైనర్ శిల్పా రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా కతార్‌కి చెందిన వ్యాపారి ప్రవీణ్ అనే వ్యాపారి వద్ద రూ.6 కోట్లు వసూలు చేసిన కాంతి దత్ మీద సీసీఎస్‌లో సైతం కేసు నమైంది.

www.epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

సామాన్యుల గళం

తెలుగు దినపత్రిక

# పోలీసులకు చిక్కిన రాయపర్తి ఎస్.బి.ఐ బ్యాంక్ దోపిడి దొంగల ముఠా సభ్యులు












**హైదరాబాద్, డిసెంబర్ 06 (సమయం న్యూస్) :**

గత నెల 18వ తేది అర్ధరాత్రి రాయపర్తి మండల కేంద్రంలోని ఎస్.బి.ఐ బ్యాంక్‌లో దోపిడికీ పాల్పడిన ఉత్తరప్రదేశ్, మహరాష్ట్రకు చెందిన ఏడుగురు సభ్యుల ముఠాలోని ముగ్గురు దొంగలను వరంగల్ పోలీసులు అరెస్టు చేయగా, ప్రధాన నిందితుడితో సహా మరో నలుగురు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు. పోలీసులకు పట్టుబడిన నిందితుల నుండి పోలీసులు సుమారు ఒక కోటి ఎనబ్కై లక్షల నాలగువేల రూపాయల విలువ గల రెండు 2కిలోల 520 గ్రాముల బంగారు అభరణాలు, ఒక కారు, పదివేల రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ప్రస్తుతం పోలీసులు అరెస్టు చేసిన వారిలో 1. అర్షాద్ అన్సారీ, తండ్రి పేరు అన్సారీ ఆహ్మద్, వయస్సు 34, షేహవాజ్‌పూర్, బుడాన్ తాలుకా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. 2. షాఖీర్‌ఖాన్ ఆలియాస్ బోలెఖాన్, తండ్రి పేరు నవాబ్ ఖాన్, వయస్సు 28, బుడాన్ తాలుకా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. 3. హిమాన్షు బిగాం చండ్ జాన్వర్, తండ్రిపేరు బిగాం చంద్, వయస్సు 30, మోటల గ్రామం, తాలుకా, బుల్దనా జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా. ప్రస్తుతం పరారీలో వున్న నిందితుల వివరాలు: మహమ్మద్ నవాబ్ హసన్, తండ్రి పేరు జకీర్ అలీ, వయస్సు 39, కక్రలా గ్రామం, బదౌన్ జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం. 2. అక్షయ్ గజానన్ అంబోర్, తండ్రి పేరు గజానన్, వయస్సు 24, సైగావ్ గ్రామం, చికిల్లి తాలుకా, మహరాష్ట్ర. 3. సాగర్ భాస్కర్ గోర్, తండ్రి భాస్కర్ గోర్, వయస్సు 32, పున్కె మోటాల గ్రామం, బుల్దానా జిల్లా, మహరాష్ట్ర. 4.సాజిద్ ఖాన్, తండ్రిపేరు జకీర్ అలీ ఖాన్, వయస్సు 35, కక్రలా గ్రామం, బడాయు జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గుర్తించబడ్డారు. ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ వివరాలను వెల్లడిస్తూ ప్రస్తుతం పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురు నిందితులతో పాటు, పరారీలో మరో నలుగురు నిందితులు ఏడుగురు సభ్యులు ముఠా ఏర్పాడ్డారు. పరారీలో వున్న ప్రధాన నిందితుడు మహమ్మద్ నవాబ్ హసన్ కొద్ది రోజుల కిందిత ఉత్తరప్రదేశ్ నుండి వచ్చి రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల్లో వుండే బ్యాంక్‌లు, బ్యాంక్ భద్రత ఏర్పాట్లపై రెక్కీ నిర్వహించాడు. అనంతరం నిందితుడు ఉత్తర ప్రదేశ్, మహరాష్ట్రలకు చెందిన మిగితా నిందితుల కలిసి హైదరాబాద్‌కు చేరుకున్నారు. వ్యాపారం ముసుగులో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నారు.

ఈ ముఠా ముందుగా గుగూల్ ద్వారా మారూమూల ప్రాంతాల్లోని బ్యాంకుల సమాచారాన్ని సేకరించడం జరిగింది. సేకరించిన సమచారంలో నిందితులు వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో ఎస్.బి.ఐ బ్యాంక్ చోరీ అనువైనదిగా గుర్తించి ఈ బ్యాంక్‌లో చోరీ చేసేందుకు ఈ ముఠా సిద్దపడ్డారు. ఈ చోరీలో భాగంగా నవంబర్ 18తేది అర్థరాత్రి తెలవారితే 19 తారీకున నిందితులు హైదరాబాద్ నుండి నిందితుల్లో ఒకడ్కైన హిమాష్ను డ్రైవింగ్ చేస్తున్న ఒక కారులో రాయపర్తి గ్రామ శివారు ప్రాంతాని చేరుకున్నారు. అనంతరం కారును తిరిగి తెల్లవారుజామున నాలుగు గంటలకు రమ్మని కారుని వెనక్కి తిప్పి పంపారు. అనంతరం మిగితా అరుగురు నిందితులో పంట పోలాల ద్వారా నిందితులు రాయపర్తి కేంద్రంలోని ఎస్.బి.ఐ బ్యాంక్ దక్షిణ భాగానికి రాత్రి 11 గంటలకు చేరుకోని అక్కడ వున్న కిటీకిని నిందితులు తోలగించి బ్యాంక్ లోనికి చోబడిన ఈ ముఠా సభ్యులు ముందుగా బ్యాంక్ సెక్యూరీటీ అలారంతో పాటు, సిసి కెమెరాల వైర్లను నిందితులు కట్ చేసి ఇద్దరు నిందితులను తొలగించిన కిటీకి వద్ద కాపలగా వుంచి ప్రధాన నిందితుడితో సహ మరో నలుగురు నిందితులు బ్యాంక్ స్ట్రాంగ్ రూం తాళాలు పగులగొట్టి, స్ట్రాంగ్ రూంలో వున్న మూడు లాకర్లను ఈ ముఠా తమ వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్లను వినియోగించి లాకర్లను కట్ చేసి అందులోవున్న సూమారు 13కోట్ల 61లక్షల రూపాయల విలువ గల బంగారు అభరణాలను వారి వెంట తెచ్చుకున్న సంచుల్లో వేసుకోని వారి వెంట తెచ్చుకున్న గ్యాస్ సిలిండర్ ఇతర స్వామగ్రిని బ్యాంక్‌లో వదిలి వేయడంతో పాటు అక్కడి నుండి వెళ్ళే ముందుగా సిసి కెమెరాల సంబంధించిన డివిఆర్‌ను ఈ ముఠా ఎత్తికెళ్లారు.చోరీ అనంతరం నిందితులు వచ్చిన కారులో తిరిగి హైదరాబాద్ కిరాయి తీసుకున్న ఇంటికి చేరుకోని నిందితులు చోరీ సోత్తును ఏడు సమాన వాటాలు పంచుకున్నారు. నవంబర్ 19వ తేదిన నిందితులు మూడు బృందాలు వీడిపోయిన మహరాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌కు తిరిగివెళ్ళిపోయారు. ఈ భారీ చోరీపై అప్రమత్తమైన వరంగల్ కమిషనరేట్ పోలీసులు వరంగల్ పోలీస్ కమిషనర్ అదేశాల మేరకు వెస్ట్‌జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్ నేతృత్వంలకో వర్ధన్నపేట ఏసిపి నర్సయ్య, సిసిఎస్ ఏసిపి భోజరాజు, నర్సంపేట ఏసిపి కిరణ్‌కుమార్‌ల అధ్వర్యంలో పదిపైగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోని నిందితుల పట్టుకోవడ కోసం ఈ ప్రత్యేక పోలీస్ బృందాలు దేశంలో వివిధ ప్రాంతాల్లో నిఘా పెట్టి నిందితుల కదలికలపై ఎప్పటికప్పుడు సమచారాన్ని సేకరించి ముగ్గురు నిందితులను గుర్తించి వారిని అరెస్టు వారి నుండి చోరీ సోత్తున స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ భారీ చోరీని అతి స్వల్పకాలంలో చేధించడంతో పాటు చోరీ సోత్తును స్వాధీనం చేసుకోవడం ప్రతిభ కనబరిచిన వెస్ట్‌జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్, ఏసిపిలు నర్సయ్య,భోజరాజు,కిరణ్‌కుమార్, ఆత్మకూర్ ,రఘునాథ్‌పల్లి, సిసిఎస్, వర్ధన్నపేట, పాలకుర్తి, నర్మెట్ట, టాస్క్‌ఫోర్స్, పోలీస్ కంట్రోల్ రూంకు చెందిన ఇన్స్‌స్పెక్టర్లు సంతోష్, శ్రీనివాసరెడ్డి,బాలాజీ వరప్రసాద్, శివకుమార్,రఘుపతి రెడ్డి, శ్రీనివాస్‌రావు,మహెందర్ రెడ్డి, అబ్బయ్య, పవన్‌కుమార్, విశ్వేశ్వర్, ఏఏఓ సల్మాన్‌పాషాతో పాటు ఎస్.ఐలు, ఇతర దర్యాప్తు పోలీస్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## హైదరాబాద్ ప్రజలకు భారీ షాక్..

**పెండింగ్ నల్లా కనెక్షన్ల బకాయిల వసూలుకు సన్నద్ధం**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

హైదరాబాద్‌లో ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటున్న నల్లా కనెక్షన్ల బకాయిలు వసూలు చేసేందుకు జలమండలి ఓటీఎస్ విధానం ప్రవేశపెట్టింది. దీని ద్వారా నల్లా బిల్లుల బకాయిలను ఎలాంటి ఆలస్య రుసుమూ, వడ్డీ లేకుండా చెల్లించే వీలుంది. తద్వారా ఇక బిల్లులు చెల్లించని వారు.. ఓటీఎస్ ఛాన్స్ వాడుకొని చెల్లించేసుకొని, బకాయిల బాధ లేకుండా చేసుకునే వీలు ఉంటుంది. మొదటగా దీనిని అక్టోబర్ 1 నుంచి 31, 2024 వరకు ప్రకటించి అమలు చేశారు. అయితే ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. దాంతో ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ఓటీఎస్ ప్రకటించిన అక్టోబర్ నెలలో దసరా, దీపావళి పండుగలు రావడం, సిటీ ప్రజలు స్వగ్రామాలకు వెళ్లడంతో బకాయిల చెల్లింపులు సరిగా సాగలేదు. దీంతో ఓటీఎస్ గడువును నవంబర్ 30 వరకు పొడిగించింది ప్రభుత్వం. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. 2020లో ఓటీఎస్ ద్వారా ప్రయోజనం పొందిన వారికి ఈ సారి అవకాశం లేకపోవడం ఒక కారణం అయితే.. ప్రజల్లో స్వతహాగానే బిల్లులు చెల్లించాలనే ఆసక్తి లేకపోవడం మరో కారణంగా కనిపిస్తోంది. హైదరాబాద్ జలమండలిలో పరిధిలో రూ.వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. అయితే 70,335 మంది బకాయిలు చెల్లించారు. వీరికి వడ్డీ, రుసుం రెండూ మాఫీ అయ్యాయి. నవంబర్ 30తో ఓటీఎస్ గడువు ముగిసింది. ఇప్పుడు మళ్లీ గడువు పొడిగించే ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నట్లు కనిపించట్లేదు. అందువల్ల నల్లా బిల్లుల బకాయిలు ఇంకా చెల్లించని వారు వెంటనే చెల్లించడం మంచిది. అలా కాదని మరింత ఆలస్యం చేస్తే, వడ్డీతోపాటూ పెనాల్టీ కూడా పెరిగిపోయే ప్రమాదం ఉంటుంది. ఎంత ఆలస్యం చేస్తే అంతలా భారం పెరుగుతుందని అధికారులు అంటున్నారు. అందువల్ల త్వరగా ఈ భారాన్ని దించుకోవాలని సూచిస్తున్నారు. ఒకవేళ ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకుంటే, నల్ల కనెక్షన్స్ కూడా రద్దు చేసే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

## రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ఉక్కుపాదం

**దోషుల్ని పట్టుకునేందుకు ఏపీలో సిట్ ఏర్పాటు**

**అమరావతి,డిసెంబర్ 6(సమయం న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ లో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు మొత్తం 13ఎఫ్ఐఆర్‌లు నమోదవగా..వాటిపై లోతుగా దర్యాప్తు చేసి ఈ రేషన్ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని బయటకు లాగేందుకు ప్రత్యేక శ్రద్ధచూపుతోంది.ఇందులో భాగంగానే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేకమైన సిట్ ను ఏర్పాటు చేసింది. ఆరుగురు పోలీసు ఉన్నతాధికారులతో ఏర్పాటైన ఈ సిట్‌కు చీఫ్‌గా వినీత్ బ్రిజ్ లాల్‌ని నియమించింది. సిట్ బృందంలో ఇద్దరు ఐపీఎస్‌లు, నలుగురు డీఎస్పీలు ఉంటారు. ఇప్పటి వరకు నమోదైన ఎఫఐఆర్‌లపై లోతుగా దర్యాప్తు చేసి 15రోజులకు ఒకసారి ప్రభుత్వానికి సిట్ నివేదిక ఆంధ్రప్రదేశ్‌లో ఉచితంగా సప్లై చేసే రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని%ొ%కొందరు అక్రమార్కులు..అడ్డదారిలో దేశం నుంచే దాటిస్తున్నారని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే గత నెల రోజుల నుంచి కాకినాడ పోర్టు ద్వారా అక్రమంగా ఆఫ్రికాతో పాటు మరికొన్ని దేశాలకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా గుర్తించింది. దీనిపై ఇప్పటికే పకడ్బంది ఏర్పాట్లు చేసింది. ఒక షిప్‌ను కూడా సీజ్ చేసింది.తాజాగా ఈ అక్రమ రేషన్ వ్యవహారాన్ని పూర్తిగా బయటపెట్టేందుకు ప్రభుత్వం ఉమాహేశ్వర్ ,అశోక్ వర్ధన్, బాలసుందరరావు , గోవింద రావు, రత్తయ్య అనే ఆరుగురు ఉన్నతాధికారులో ప్రత్యేకంగా సిట్ ను ఏర్పాటు చేసింది. ఈ ఆరుగురిలో ఇద్దరు ఐపీఎస్ లు, నలుగురు డీఎస్పీలు ఉన్నారు. ఆరుగురు అధికారులో ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించింది ప్రభుత్వం.ఈ సిట్‌కు చీఫ్‌గా వినీత్ బ్రిజ్ లాల్‌ని నియమించింది. రేషన్ అక్రమాలతో పాటు విదేశాలు, ఆఫ్రికా కంట్రీస్‌కు తరలిస్తున్నట్లుగా నమోదైన ఎఫ్ఐఆర్‌లపై సిట్ రోజు విచారించనుంది. ప్రతి 15రోజులకు ఒకసారి దీనిపై కేసు పురోగతిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. అంతేకాదు ఈ రేషన్ అక్రమాలపై దోషులుగా తేలిన వ్యక్తులను అరెస్ట్ చేసే అధికారాన్ని కూడా సిట్ కు అప్పగించింది ప్రభుత్వం.

## పోలవరం ప్రాజెక్టుపై ఒడిశా అసెంబ్లీలో చర్చ

**అమరావతి,డిసెంబర్ 6(సమయం న్యూస్):**

ఏపీలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుపై ఒడిశా అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ శీతాకాల సమావేశాల్లో ఈ అంశం ఆ రాష్ట్ర అసెంబ్లీని వేడెక్కిస్తోంది. ప్రతిపక్ష నేత నవీన్ పట్నాయక్ ఏమన్నారంటే.. " రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ఎప్పుడూ పోరాడింది. భవిష్యత్తులో కూడా మేము ఈ పోరాటం కొనసాగిస్తాం ఒడిశాలో అధికార పక్షంగా బీజేపీ ఉండటం.. ఏపీలోని కూటమి ప్రభుత్వంలో బీజేపీ ఉండటంతో.. ఒడిశాలో పాలక పక్షం.. పోలవరం అంశంపై గట్టిగా ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించలేని పరిస్థితి ఉంది. ఏపీ ప్రభుత్వంలో కీలక పార్టీగా ఉన్న టీడీపీ అవసరం కేంద్రంలో బీజేపీకి బాగా ఉంది. దాంతో.. కేంద్రం పోలవరం ప్రాజెక్టుకి అనుకూలంగా ఉంది. ఈ పరిస్థితులను ప్రతిపక్ష బీజేడీ క్యాష్ చేసుకొని.. అసెంబ్లీని వేడెక్కిస్తోంది. ఈ పరిస్థితుల్లో స్పీకర్.. అసెంబ్లీని సాయంత్రం 4 గంటల వరకూ వాయిదా వేశారు.ఈ మధ్య బీజేడీకి చెందిన నేతలు, కొంతమంది పర్యావరణ, గిరిజన వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులు కలిసి.. ఒక బృందంగా ఢిల్లీకి వెళ్లారు. పోలవరం ప్రాజెక్టుపై అభ్యంతరాలను కేంద్రానికి తెలిపారు. పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తే, ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాపై తీవ్ర ప్రభావం పడుతుందనీ, గిరిజనులు నివసించే చాలా ప్రాంతాలకు ముంపు ప్రమాదం ఏర్పడి, వారిని అక్కడి నుంచి వేరే ప్రాంతాలకు తరలించాల్సి వస్తుందని ఆ బృందం తెలిపింది. అంతే కాదు ఈ బృందం కేంద్ర జలశక్తి మంత్రి సీ ఆర్ పాటిల్‌ని కూడా కలిసి.. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరింది. పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం.. ముంపు ప్రాంతాలపై ఎలా ఉంటుందో మరోసారి అధ్యయనం చెయ్యాలని కోరింది. కేంద్ర ప్రభుత్వం పోలవరం నిర్మాణానికి అనుకూలంగా ఉంది. తెలుగు రాష్ట్రాల విభజన చట్టం ప్రకారం.. పోలవరం నిర్మాణాన్ని పూర్తి చెయ్యాల్సిన బాధ్యత కేంద్రానిదే. అయితే 2014లో ఈ బాధ్యతను అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకుంది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక, ఈ ప్రాజెక్టుపై పెద్దగా కదలిక లేదు. కేంద్రం కూడా తేలిగ్గా తీసుకుంది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం దీన్ని నిర్మించేందుకు ఆసక్తిగా ఉంది. కేంద్రం కూడా సహకరిస్తామంటోంది. అందుకే ఇప్పుడు బీజేడీ.. ఈ అంశాన్ని లేవనెత్తుతూ.. బలమైన ప్రతిపక్షంగా నిలిచేందుకు ప్రయత్నిస్తోంది. ఇది ఒడిశాలోని పాలక బీజేపీకి సమస్యగా మారుతోంది.

## సచివాలయంలో ఈ నెల 9న విగ్రహావిష్కరణ

**కేసీఆర్, కిషన్ రెడ్డి అపాయింట్ మెంట్ ఇస్తే వెళ్లి ఆహ్వానిస్తాం**

**తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు విపక్ష నేతలను ఆహ్వానిస్తాం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఆహ్వానిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందుకోసం వారిని సమయం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. వారు అపాయింట్ మెంట్ ఇస్తే ప్రభుత్వం తరపున ఆహ్వానిస్తామన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు విపక్ష నేతలను ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేసీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఆహ్వానిస్తామని సీఎం రేవంత్ రెడ్డి నిన్ననే చెప్పారని గుర్తు చేశారు. వారు ఈ నెల 9న జరగనున్న ఈ కార్యక్రమానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

## పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం కానున్న కేసీఆర్

**8న మధ్యాహ్నం 1 గంటలకు సమావేశం - ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో భేటీ కానున్న కేసీఆర్**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎల్లుండి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం కానున్నారు. ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 1 గంటలకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమవుతారు. ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ సమావేశం జరగనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. సచివాలయంలో ఏర్పాటు చేస్తోంది తెలంగాణ తల్లి విగ్రహమా? లేక కాంగ్రెస్ తల్లి విగ్రహమా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని మండిపడ్డారు. నాలుగేళ్ల తర్వాత తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడ ఉండాలో అక్కడే ఉంటుందన్నారు. అలాగే రాజీవ్ గాంధీ విగ్రహం ఎక్కడ ఉండాలో అక్కడికే పంపిస్తామన్నారు.

## గ్రూప్-1 పరీక్షల రద్దు కుదరదు

**తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట**

**పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమన్న ధర్మాసనం**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదని భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్‌ను వాయిదా వేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. విచారణ జరిపిన న్యాయస్థానం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించినట్లయింది. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త నోటిఫికేషన్ చట్ట విరుద్ధమని కొంతమంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రిలిమ్స్‌లో 14 తప్పులున్నాయని పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌ను వాయిదా వేయాలని కోరారు. అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును అభ్యర్థులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. పిటిషనర్లు మెయిన్స్‌కు క్వాలిఫై కానందున మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాల్సిన అవసరం లేదని తెలిపింది. పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమని ధర్మాసనం పేర్కొంది. కోర్టుల నిర్ణయంతో నియామకాల్లో జాప్యం జరుగుతుందని తెలిపింది. మెయిన్స్ నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వానికి పచ్చజెండా ఊపింది.

# విద్యార్థుల్ని మేము ఎవరెస్ట్ ఎక్కిస్తుంటే, ప్రభుత్వం పాడె ఎక్కిస్తోంది

**దళితుల అభివృద్ధికి సైతం ఈ ప్రభుత్వం వ్యతిరేకం**
**దళిత బంధు పెంచి ఇస్తామంటూ హామీ ఇచ్చి మోసం**
**అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజులపాటు నిర్వహించాలి**
**భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా భారత రాష్ట్ర సమితి ) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. "అంబేద్కర్ వారసత్వం, లెగసీ సమాజానికి తెలియకూడదనే దురుద్దేశంతో, అంబేద్కర్ వ్యతిరేక ఆలోచనా విధానంతో ఆయన వర్ధంతిని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించడం లేదు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అతిపెద్ద అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం కనీసం పూలమాల కూడా వెయ్యట్లేదు. దళితులందరికీ సమాజంలోని ప్రజలందరికీ స్ఫూర్తినిచ్చే అంబేద్కర్ భారీ విగ్రహాన్ని ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలి. దీని వెనుక ఉన్న లక్ష్యాలను రాష్ట్ర ప్రభుత్వం తెలియజేయాలి. కేవలం కాంగ్రెస్ హై కమాండ్ ఉద్దేశాలతోనే అంబేద్కర్ విగ్రహానికి అవమానం చేస్తున్నారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు. "ప్రకాష్ అంబేద్కర్ చేత ప్రారంభించిన మహా విగ్రహానికి ఎందుకు అవమానం చేస్తుంది? తాళాలు వేసి బంధించి కనీసం శుభ్రపరచకుండా ఎందుకు పెట్టింది. బీఆర్ఎస్ పైన అక్కసు ఉంటే దానిని అంబేద్కర్ విగ్రహం పైన ఎందుకు చూపిస్తున్నారు. అంబేద్కర్‌కు నివాళులు అర్పించకుండా అడ్డుకుంటుంది మమ్మల్ని కాదు అంబేద్కర్ వారసులను అంబేద్కర్ ఆలోచన విధానాన్ని. అంబేద్కర్‌కి నివాళులు అర్పించాలనే ఇంగిత సంస్కారం లేని కుసంస్కారి రేవంత్ రెడ్డి. ప్రపంచం అబ్బురపడిన మహా మేధావి అంబేద్కర్ గారిని స్మరించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడికక్కడో విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నారు. అదే స్ఫూర్తితో దేశానికి ఒక గొప్ప సందేశం ఇచ్చేలా ఏర్పాటు చేసుకున్న 125 ఫీట్ల అంబేద్కర్ విగ్రహం పైన ప్రభుత్వం కావాలని నిర్లక్ష్యం వహిస్తున్నది" అని కేటీఆర్ అన్నారు. అంబేద్కర్ ఆలోచన విధానానికి అంబేద్కర్ విగ్రహానికే కాదు దళితుల అభివృద్ధికి సైతం ఈ ప్రభుత్వం వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నది. దళిత బంధు పెంచి ఇస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేసింది. దళిత బంధు చెక్కులను రద్దుచేసి వారి జీవితాలను మారకుండా చేస్తున్నది. పేద దళిత గిరిజన బహుజన బిడ్డలను ఉన్నత చదువుల కోసం గత ప్రభుత్వం విదేశాలకు పంపిస్తే%ఔ% ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఓర్వలేక వారి ఓవర్సీస్ స్కాలర్షిప్పులను నిలిపివేశారు. తెలంగాణ బిడ్డలు విదేశాల్లో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. గురుకుల విద్యార్థులను మేము ఎవరెస్ట్ ఎక్కిస్తే, ఈ ప్రభుత్వం వారిని పాడె ఎక్కిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వివక్షను చేతగానితనాన్ని దాచిపెట్టడం కోసమే భారత రాష్ట్ర సమితి చేపట్టిన గురుకుల బాటను అడ్డుకుంది" అని కేటీఆర్ తెలిపారు. "ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వంటి నాయకుల పైనా కేసులు పెట్టింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షకుని మాదిరిగా పోజులు కొడుతూ దేశంలో తిరుగుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో తమను అడ్డుకున్న పోలీసుల పైన ఉక్రోషం వ్యక్తం చేసిన రాహుల్ గాంధీ, అదే హోదాలో ఉన్న ఎమ్మెల్యేలను శాసనసభ పక్ష నేతలను తెలంగాణ పోలీసులు అడ్డుకున్న విషయాన్ని గుర్తించాలి. తమ సొంత కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేకంగా నియంతృత్వంగా వ్యవహరిస్తున్న తీరుని గుర్తించాలి. నిజంగానే రాహుల్ గాంధీకి రాజ్యాంగం పైన ప్రేమ ఉంటే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్న తీరు పైన సద్బుద్ధి ప్రసాదించాలని సూచించాలి" అని కేటీఆర్ అన్నారు. "రానున్న అసెంబ్లీ సమావేశాలను కనీసం నెల రోజులపాటు నిర్వహించాలి. 11 నెలల కాలంలో ఈ రాష్ట్రం సబ్బండ వర్గాలకు చేసిన అన్యాయాలను ప్రశ్నిస్తాము. లగచర్ల అంశం నుంచి మొదలుకొని రాష్ట్రంలో కొనసాగుతున్న ఆత్మహత్యలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల అమలులో వైఫల్యం, వ్యవసాయ రంగ సంక్షేమం, ప్రతి అంశం పైనా, ప్రజా సమస్యల పైన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాము. మా పార్టీ అధ్యక్షులు తెలంగాణ ప్రధాత కేసిఆర్ గారి పైన కాకికూతలు కారుకూతలు మానకుంటే ముఖ్యమంత్రి కి ముఖ్యమంత్రి పదవికి కూడా గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇదే ముఖ్యమంత్రి సోనియాగాంధీని అడ్డగోలుగా దూషించిన విషయాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. రేవంత్ రెడ్డి నోటి తీరు మార్చుకుంటేనే ఆయన పదవికి గౌరవం దక్కుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. తమ ప్రవర్తనతో పదవులకు వ్యక్తులకు గౌరవం వస్తుంది. కానీ అడుక్కుంటే కాదని రేవంత్ రెడ్డి తెలుసుకోవాలి. రేవంత్ రెడ్డి ఏర్పాటు చేస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహమా%ఔ% కాంగ్రెస్ తల్లి విగ్రహమా%ఔ% చెప్పాలి" అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వాలు మారినప్పుడు విగ్రహాల రూపులు చరిత్రను మారుస్తామంటే ఎవరూ ఒప్పుకోరు. ఉద్యమకాలంలో సబ్బండ వర్గాలు, కవులు, కళాకారులు, మేధావులు అంతా కలిసి తెలంగాణ పరిస్థితిలకు అనుగుణంగా సంస్కృతికి అనుగుణంగా రూపం ఇచ్చిన తల్లి విగ్రహమే తెలంగాణ తల్లి. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలను దాటుకొని ఒక దేవతను ఊరేగించిన మాదిరి తెలంగాణ తల్లి విగ్రహ స్థాపన చేశాం. రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి రూపు మారుస్తానని తెలంగాణ చరిత్రను మారుస్తానని నీచమైన మనస్తత్వంతో ఈ కుటిల ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఇందిరాగాంధీ భరతమాత విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే తర్వాతి ప్రభుత్వాలు మార్చాయా? తెలుగు తల్లిని, కన్నడ తల్లిని మార్చనప్పుడు తెలంగాణ తల్లిని మార్చే కుసంస్కారం భావదారిద్ర్యం రేవంత్ రెడ్డికి ఎందుకు? కచ్చితంగా మేము ప్రభుత్వంలోకి రాగానే రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం ఏర్పాటు చేసిన చోట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఏర్పాటు చేస్తాం. అమరవీరుల స్తూపానికి అంబేద్కర్ సచివాలయానికి మధ్యన ఉండాల్సింది కచ్చితంగా తెలంగాణ తల్లి విగ్రహం. అందుకే రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం పంపాల్సిన చోటికి పంపిస్తాం. తెలంగాణ చరిత్రను మారుస్తామంటే ఊరుకునేది లేదని కేటీఆర్ మండిపడ్డారు.

## అరెస్టులతో భయపడా : పాడి కౌశిక్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమయం న్యూస్):**

ఇలాంటి అరెస్టులకు భయపడేది లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాని చెప్పారు. ఊపిరి ఉన్నంత వరకు హుజూరాబాద్ ప్రజల కోసం ప్రశ్నిస్తానన్నారు. ప్రజల ఇచ్చిన ఆరు గ్యారంటీల కోసం ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అర్ధరాత్రి జడ్జి బెయిల్ మంజూరు చేసిన అనంతరం అయన మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కౌశిక్‌రెడ్డిని కొండాపూర్‌లోని తన నివాసంలో జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే నోటీసులు ఇచ్చి వదిలిపెట్టేందుకు అవకాశాలున్నా రాత్రి పొద్దుపోయే దాకా పీఎస్‌లోనే నిర్బంధించారు. రాత్రి 10.30 గంటలు దాటిన తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి అర్ధరాత్రి కొత్తపేటలోని న్యాయమూర్తి ఇంట్లో హాజరుపరిచారు. వాదనలు విన్న జడ్జి.. రిమాండ్‌ను తిరస్కరించారు. రూ.5 వేలు జరిమాన, ఇద్దరి పూచీకత్తుతో కౌశిక్‌కు బెయిల్ మంజూరు చేశారు.

## బ్యాంకు ఖాతాకు 4 నామినీలు..

**లోక్‌సభలో బిల్లు ఆమోదం!**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ బిల్లు ఒక బ్యాంకు ఖాతాలో 4 నామినీలను జోడించడానికి అందిస్తుంది. కొత్త బ్యాంకింగ్ చట్టం బిల్లులో డిపాజిటర్లకు మెరుగైన రక్షణ, ప్రైవేట్ బ్యాంకుల్లో మెరుగైన సేవలందించే అంశాలు కూడా ఉన్నాయి. క్లెయిమ్ చేయని షేర్లు, బాండ్‌లు, డివిడెండ్‌లు, వడ్డీ లేదా రిడెంప్షన్ ఆదాయాలను విద్య నిధికి బదిలీ చేయడానికి బిల్లు సులభతరం చేస్తుంది. ఇది పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడుతుంది. బదిలీ, వాపసు క్లెయిమ్‌ల కోసం సౌకర్యాన్ని అందిస్తుంది. బిల్లులోని ఇతర ముఖ్యమైన సవరణలు బ్యాంక్ డైరెక్టర్ల కోసం గణనీయమైన వడ్డీని అందుకోవడం గురించి కూడా ఉన్నాయి. దాదాపు ఆరు దశాబ్దాలుగా ఎలాంటి మార్పు లేకుండా ఉన్న ఈ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచాలనే నిబంధన బిల్లులో ఉంది.కోవిడ్ 19 మహమ్మారి కారణంగా ఏర్పడిన సమస్యల తర్వాత బ్యాంకింగ్ చట్ట సవరణ బిల్లులో ఈ ప్రధాన మార్పులు చేశారు. ఇప్పుడు ఒక నామినీకి బదులుగా 4 నామినీలు యాడ్ చేసేందుకు అనుమతి ఉంటుంది. ఖాతాదారుడు మరణించిన తర్వాత డబ్బు ఉపసంహరణను సులభతరం చేయడం దీని ఉద్దేశ్యం.డిపాజిటర్లు ఏకమొత్తం నామినేషన్‌ను ఎంచుకోవడానికి బిల్లు అనుమతిస్తుంది. నామినీకి నిర్ణీత శాతం షేర్లు లేదా సీక్వెన్షియల్ నామినేషన్ కేటాయించబడిన చోట నామినీ వయస్సు ప్రకారం బ్యాంకులో డిపాజిట్ చేసిన మొత్తం అందిస్తారు. ఈ మార్పు హోమ్ లోన్‌లకు యాక్సెస్‌ను సులభతరం చేస్తుందని, బ్యాంకింగ్ ప్రక్రియలలో ఆలస్యం తగ్గుతుందని భావిస్తున్నారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాత బ్యాంకులు తమ నివేదికలను ప్రతి శుక్రవారం కాకుండా ప్రతి పక్షం రోజుల చివరి రోజున రిజర్వ్ బ్యాంక్‌కు సమర్పిస్తాయి. దీనితో పాటు నోటిఫై చేయని బ్యాంకులు మిగిలిన నగదు నిల్వలను నిర్వహించాలి. సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌ను రాష్ట్ర సహకార బ్యాంకు బోర్డులో పనిచేయడానికి కూడా బిల్లు అందిస్తుంది.బిల్లులో మరో ముఖ్యమైన మార్పు చేసినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పటి వరకు ఏడేళ్లపాటు ఖాతాలో ఎలాంటి లావాదేవీలు లేకుంటే అది ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ సవరణ తర్వాత ఖాతాదారుడు ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ నుండి మొత్తం రీఫండ్‌ను క్లెయిమ్ చేయవచ్చు.

## ప్రపంచం ముంగిట మరో పెనుముప్పు

**దడపుట్టిస్తున్న బ్లీడింగ్ ఐ వైరస్..**
**15 రోజుల్లో 150 మంది మృత్యువాత**
**చికిత్సలేక ఇళ్లలోనే చనిపోతున్న జనాలు**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

ప్రపంచ దేశాలు 'బ్లీడింగ్ ఐ వైరస్' మహమ్మారికి గజగజ వణకుతున్నాయి. ప్రస్తుతం ఆఫ్రికాను వేధిస్తున్న ఈ వైరస్ అక్కడి నైరుతి కాంగోలో తొలిసారి బయటపడింది. ఈ అంతుచిక్కని వ్యాధి కాంగోలోని క్వాంగో ప్రావిన్సులో మారణహోమాన్ని సృష్టిస్తుంది. కేవలం 15 రోజుల్లో దాదాపు 150 మందిని పొట్టనబెట్టుకుంది. దీంతో ఆ దేశ ఆరోగ్య అధికారులు హెల్త్ ఎమర్జెన్సీ జారీ చేశారు. నవంబర్ 10 నుంచి నవంబర్ 25 మధ్య కాంగో ప్రావిన్స్‌లోని పాంజీ హెల్త్ జోన్‌లో ఈ మరణాలు సంభవించాయి. అంతుచిక్కని మరణాలను గల కారణాలను అన్వేషించడానికి రోగుల నుంచి నమూనాలు సేకరించేందుకు ఒక వైద్య బృందం పాంజీ హెల్త్ జోన్ చేరుకుంది. అక్కడి ప్రాంతీయ ఆరోగ్య మంత్రి అపోలినైర్ యుంబా ప్రకారం. దీని అనారోగ్య లక్షణాలు ఫ్లూని పోలి ఉన్నట్లు తెలిపారు. రోగుల్లో అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, దగ్గు, రక్తహీనత వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. దీనికి చికిత్స అందుబాటులో లేకపోవడంతో అనేక మంది రోగులు తమ ఇళ్లలోనే మృత్యువాత పడుతున్నారు. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని ఆరోగ్య అధికారులు సమస్యాత్మక ప్రదేశాల్లో జనాల అనారోగ్యంపై నిఘా ఉంచారు. ఇది అంటువ్యాధని, మృతదేహాల దరిదాపుల్లోకి కూడా ఎవ్వరూ రావొద్దంటూ అక్కడి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఇక్కడి ఆరోగ్య సమస్యను పరిష్కరించడానికి, వైద్య సామాగ్రిని సరఫరా చేయాలని ఆరోగ్య మంత్రి అపోలినైర్ యుంబా దేశీయ, విదేశీ భాగస్వాముల సహాయం కోరారు. రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. స్థానిక ఎపిడెమియాలజీ ప్రకారం, ఈ వ్యాధి మహిళలు, పిల్లలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్లు పేర్కొంది. మరణాల సంఖ్య వేగంగా పెరుగుతోందని, ఒక్క నవంబర్ 25వ తేదీన దాదాపు 67 మరణాలు నమోదైనట్లు అక్కడి ఆరోగ్య అధికారులు వెల్లడించారు. చైనా నుంచి శరవేగంగా ప్రపంచ దేశాలకు ప్రయాణించిన కోవిడ్ -19 వ్యాప్తితో కోట్లాది మంది ప్రాణాలు వదిలారు. కాంగోలో విజృంభిస్తున్న ఈ కొత్త వైరస్‌ను కట్టడి చేయకుంటే మరోమారు ప్రమదం ముంచుకొచ్చే అవకాశం ఉందని ప్రపంచదేశాలు ఆందోళన చెందుతున్నాయి.

## లగచర్ల కేసులో పట్నం నరేందర్ రెడ్డిని కస్టడీకి అనుమతించిన కోర్టు

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

వికారాబాద్ జిల్లాలోని లగచర్ల దాడి కేసులో ఏ-1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డిని కొడంగల్ కోర్టు పోలీస్ కస్టడీకి అనుమతించింది. నరేందర్ రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం నరేందర్ రెడ్డిని రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతించింది. ఆయన ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉన్నారు. అతనిని రేపు చర్లపల్లి జైలు నుంచి వికారాబాద్‌కు తరలిస్తారు.

## రేవంత్ రెడ్డి హెూదా, స్థాయిని మరిచి మాట్లడుతున్నారు

**హైదరాబాద్, డిసెంబర్ 6(సమయం న్యూస్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన హెూదాను, స్థాయిని మరిచి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డికి డీఎన్ఏ పరీక్ష జరగాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు శిక్ష తప్పదని హెచ్చరించారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నివాళులర్పించిన ఈటల మాట్లాడుతూ... రాజ్యాంగ స్ఫూర్తిని ప్రధాని మోదీ సమున్నతంగా కాపాడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజలకు సేవకులుగా ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలతో ప్రజలను దగా చేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఏం మంచి చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు చేసుకుంటుందో చెప్పాలన్నారు. ప్రజాక్షేత్రంలో తాము ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు. రేవంత్ రెడ్డి ఈ ఏడాది కాలంలో ఏం చేశారని అన్ని వర్గాలు ప్రశ్నిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ దుర్మార్గాలను ఖండిస్తూ నిర్వహించబోయే సభకు జేపీ నడ్డా హాజరవుతారని తెలిపారు.

### బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌కు ఉన్న తేడా ఇదే.?

**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమయం న్యూస్):**

ఈ దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహానీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోవడాన్ని బీఆర్ఎస్ పార్టీ తప్పుబట్టింది. అంబేద్కర్ విగ్రహానికి కనీసం నివాళులర్పించకుండా నిమ్మకు నీరెత్తినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. రాహుల్ గాంధీ జీ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించాలని మీరేమైనా మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి, మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా ఏంటో ఈ చిత్రం చూస్తే తెలిసిపోతుందన్నారు. కేసీఆర్ హయాంలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించి, జయంతి, వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని కేటీఆర్ తెలిపారు. కానీ మీ కాంగ్రెస్ ప్రభుత్వంలో అంబేద్కర్‌కు కనీసం నివాళులర్పించకుండా అవమానించారని మండిపడ్డారు. మీ ప్రభుత్వం అంబేద్కర్‌ను ఎలా నిర్లక్ష్యం చేస్తుందో అనడానికి ఈ ఘటన నిదర్శనం అని పేర్కొన్నారు. ఎంత అవమానం రాహుల్ గాంధీ జీ అని కేటీఆర్ పేర్కొన్నారు.

## వైభవంగా అమ్మవారి పంచమీ తీర్థం

**తిరుపతి, డిసెంబర్ 6 (సమయం న్యూస్):**

తిరుచానూరులోని పద్మావతి అమ్మవారు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అఖరు రోజు శుక్రవారం పంచమి తిథిని పురస్కరించుకుని అశేష భక్తజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. పద్మ పుష్కరిణిలో స్నానం ఆచరించిన భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని పొందారు. ముందుగా పంచమి తీర్థ మండపంలో అమ్మవారికి, చక్రత్తాళ్వార్‌కు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అలంకరించిన పూలమాలలు, కిరీటాలు భక్తులకు కనువిందు చేశాయి. అంతకుముందు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఈవో, అదనపు ఈవోలకు టీటీడీ తరుపున సారెను అందజేశారు. సారెకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు-కుంకుమ, చందనం, పట్టుచీరతో పాటు రూ కోటి 20 లక్షలతో వెచ్చించి ప్రత్యేకంగా తయారు చేయించిన స్వర్ణ కిరీటం, వజ్రాలహారం, గాజులు, దుద్దెలు సారెగా సమర్పించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం స్వేచ్ఛను హరిస్తుంది

**ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే నిర్బంధాలా?**
**నామీద అక్కసుతో సచివాలయం గేట్లు కూడా తెరవడం లేదు : మాజీ మంత్రి కేటీఆర్**

**హైదరాబాద్, డిసెంబర్ 6 (సమయం న్యూస్):**

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో స్వేచ్ఛను హరిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలుపుతుంటే అడ్డుకుంటున్నారని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేనట్లుగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నగరం నడిబొడ్డున కేసీఆర్ ఏర్పాటు చేశారు. సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి గౌరవించుకున్నామని చెప్పారు. తమమీద అక్కసుతో బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి నాడు కనీసం గేట్లు కూడా తెరవకుండా ఆ మహానీయున్ని నిర్బంధించి, అవమానిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. కాంగ్రెస్ నిర్బంధిస్తున్నది బీఆర్ఎస్ నేతలను కాదని, అంబేద్కర్‌నని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అంబేద్కర్ విగ్రహాన్ని నిర్లక్ష్యం చేయడం వెనుక మీ ఉద్దేశమేంటని ప్రశ్నించారు. దళితబంధు తొలగించి అంబేద్కర్ అభయహస్తం తెస్తామన్నారని, ఇప్పటి వరకు దాని అమలు ఊసేలేదని విమర్శించారు. దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న వారిపై దండిగా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అంబేద్కర్ విగ్రహం దగ్గర ఎలాంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. వందల మంది పోలీసులను పెట్టి తమను నిర్బంధిస్తున్నారని విమర్శించారు. గురుకులాల్లో 48 మంది విద్యార్థులు చనిపోయారన్నారు. గురుకుల విద్యార్థులను తాము ఎవరెస్ట్ శిఖరాలు ఎక్కిస్తే.. మీరు పాడె ఎక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదేనా మీరు అంబేద్కర్‌కు ఇచ్చే నివాళి అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ గురుకుల బాటను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీని అడ్డుకుంటే సీఎం రేవంత్ రెడ్డి రాజ్యాంగం గురించి మాట్లాడుతాడని, అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలను అడ్డుకోవడం ఎంతవరకు కరెక్టని విమర్శించారు. రాహుల్ గాంధీ చెప్పేదొకటి చేసేదొకటన్నారు. మీ సీఎంకు జ్ఞానోదయం చేయాలంటూ రాహుల్ గాంధీకి సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ అసమర్థతను ఎండగడుతామని చెప్పారు. మర్యాద అనేది ఇచ్చిపుచ్చుకునేదని, కావాలని అడుక్కుంటే రాదని ఎద్దేవా చేశారు. కనీసం నెల రోజులు సమావేశాలు జరగాలన్నారు. సచివాలయంలో రేవంత్ రెడ్డి ప్రతిష్టిస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహమా లేదా కాంగ్రెస్ తల్లి విగ్రహమా అని ప్రశ్నించారు. ప్రభుత్వం మారినప్పుడల్లా లోగోలు, నంబర్ ప్లేట్లు మారాలా అని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టారని విమర్శించారు. ఉద్యమ సమయంలో ప్రజలు స్వచ్ఛందంగా తెలంగాణ తల్లి విగ్రహాలు పెట్టుకున్నారని చెప్పారు. నాలుగేండ్ల తర్వాత ఎక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలో.. ఎక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం ఉండాలో అక్కడికి పంపిస్తామన్నారు.

www.epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
సామాన్యుల గళం తెలుగు దినపత్రిక

## ఒకే ఫ్రేమ్‌లో జంట



సినిమా : బాలీవుడ్ స్టార్ జంట ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్ జంట ఒకే ఫ్రేమ్‌లో దర్శనమిచ్చారు. తాజాగా ఓ ఈవెంట్‌కు హాజరయ్యారు. ఇద్దరూ బ్లాక్ డ్రెస్‌లు ధరించి ఫొటోలకు ఫోజులిస్తూ సందడి చేశారు. ఐశ్వర్య తల్లి బృంద్య, అను రంజన్‌తో కలిసి ఈ స్టార్ జంట సెల్ఫీలు దిగారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. విడాకులు తీసుకోబోతున్నదంటూ ఇటీవల వార్తలు తెగ హల్‌చల్ చేస్తున్నాయి. అభిషేక్ నటి నిమ్రత్ కౌర్‌తో రిలేషన్‌లో ఉన్నాడని ఈ క్రమంలోనై ఐష్ నుంచి విడిపోనున్నట్లుగా బాలీవుడ్ కోడై కూస్తున్నది. ఈ క్రమంలోనే ఏ పార్టీకి హాజరైనా బచ్చన్ ఫ్యామిలీ కుటుంబంతో సహా హాజరవుతున్నా.. ఐశ్వర్య మాత్రం కూతురు ఆరాధ్యతో కలిసి వేరుగా హాజరవడం ఈ వార్తలకు మరింత ఆజ్యంపోసినట్లయ్యింది. కూతురు ఆరాధ్య బర్త్ డే వేడుకలకు సైతం అభిషేక్ దూరంగా ఉన్నాడు. దీంతో ఈ జంట త్వరలో విడాకులు తీసుకోవడం ఖాయం అని అందరూ భావించారు. ఇంతలోనే ఇద్దరూ ఓ కార్యక్రమానికి హాజరై ఆ రూమర్స్‌కు చెక్ పెట్టారు.

## జాన్వీ కౌంటర్



జాన్వీకపూర్ పుష్ప2 కోసం ఒకరికి కౌంటర్ ఇవ్వక తప్పలేదు. ఏ విషయంలో అనే సందేహమా? విషయానికొస్తే.. పుష్ప 2 ది రూల్ కోసం అన్ని తెరలను ముందే రిజర్వ్ చేశారు. ఇంటర్ స్టెల్లార్ మూవీ పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 6 ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకంగా ఐమాక్స్ స్క్రీన్లలో రీ రిలీజ్ చేశారు. కానీ ఇండియాలో జరగలేదు. ఇది కొందరు మేధావులైన మూవీ లవర్స్ కి కోపం తెప్పించింది. అదేంటి ఇంటర్ స్టెల్లార్ ని నిర్లక్ష్యం చేసినందుకు ఇండియాకి సినిమా తీసే అర్హత లేదనే స్థాయిలో ఒక పేరున్న మీమ్ పేజీ పోస్ట్ చేసింది. దీనిపై జాన్వీ కపూర్ స్పందించింది. పుష్ప 2 కూడా సినిమానే, వెస్ట్ ని పొగడాలనే ఉద్దేశంతో మనల్ని మనం మనం తక్కువ చేసుకోవడం ఎందుకంది ఈ అమ్మడు.

## డీప్ ఫేక్ వీడియో



'లగ్గం' సినిమాతో బ్యూటీ ప్రగ్యా నగ్రా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది. ఆమె పేరు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. దీనికి కారణం ఓ ప్రైవేట్ వీడియో ఆన్‌లైన్‌లో లీక్ అవడమే. అది ఆమెదేనని కొందరు చెబుతున్నారు. ఆ వీడియోలో ప్రగ్య.. ఓ వ్యక్తితో ఏకాంతంగా ఉన్నారు. ఆ వ్యక్తి ఆమె ప్రియుడేనని చెబుతున్నారు. అయితే ఇటీవలి కాలంలో డీప్ ఫేక్ వీడియోలు ఎక్కువైపోతున్నాయి. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సహజ సన్నివేశాల కోసమే..



సంజయ్ లీలా భన్సాలీ డ్రీమ్ ప్రాజెక్ట్ 'హీరామండి: డైమండ్ బజార్'. మనీషా కొయిరాలా, అదితి రావు హైదరీ, సోనాక్షి సిన్హా, రిచా చద్దా తదితరులు నటించారు. అదితి ఈ వెబ్ సిరీస్‌కి సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. "హీరామండి షూటింగ్ సమయంలో నేను ఎన్నో నిద్రలేని రాత్రులను గడపాల్సి వచ్చింది. కొన్ని భావోద్వేగ సన్నివేశాల షూటింగ్ సమయంలో సంజయ్ నన్ను ఒకరోజంతా భోజనం చేయనివ్వలేదు. సన్నివేశాలు సహజంగా రావడం కోసం అలా చేశారు. ఆకలితో ఉండటం నాకు చాలా సహాయపడింది. ఆయా సన్నివేశాలు చాలా సహజంగా వచ్చాయి" అని అదితి వెల్లడించారు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek art printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10,GROUND FLOUR budha bhavan m.g.road secundrabad 03. Ali publicacstion Hyderabad, www.samayam.net.
Mobile no. 98660 19778, 89789 60131.